## బిజెపి నాయకుల ముందస్తు అరెస్ట్



చెన్‌గోముల్ పోలీస్టేషన్‌లో అరెస్టు అయిన జిల్లా బిజెపి నాయకులు రవీందర్, తదితరులు

**పూడూరు, జూలై 5, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బిజెపి నాయకులను చెన్‌గోముల్ పోలీసులు మందస్తుగా అరెస్టు చేశారు. ఎన్నికలముందు సిఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయ్యారనే నెపంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిజెవైఎం రాష్ట్రశాఖ పిలుపుమేరకు శుక్రవారం నిర్వహించతల పెట్టిన కలెక్టరేట్‌ల ముట్టడికి బిజెపి శ్రేణులుయత్నించాయి. దీంతో అప్రమత్తమైన చెన్‌గోముల్ పోలీసులు బిజెపి జిల్లా అధికార ప్రతినిధి రవీందర్‌ను కంకల్ గ్రామంలో, జిల్లా కార్యవర్గ సభ్యుడు కన్నయ్యొల్ల రాజు, నాయకులు మనోహర్‌లను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## విద్యార్థిని శ్రేయారెడ్డికి అంతర్జాతీయ పురస్కారం

**మేడ్చల్, జులై 5, ప్రభాతవార్త :** మేడ్చల్‌కు చెందిన పీజీ విద్యార్థినికి అంతర్జాతీయ పర్యావరణ పురస్కారం లభించింది. బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో గల ఏయిమ్స్ విశ్వవిద్యాలయంలో పీజీ చదువు తున్న మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపికా నర్సింహారెడ్డి కూతురు డాక్టర్ మర్రి శ్రేయారెడ్డి అంత ర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకని పర్యావరణ పరిరక్షణకై నిర్వహించిన అంతర్జా తీయ స్థాయి పోటీలో పాలుపంచుకున్నారు. సుమారు నెల రోజుల పాటు వివిద అంశాలపై నిర్వహిం చిన పోటీల్లో ప్రతిభ కనబర్చి అగ్రస్థానంలో నిలిచారు. ఉత్తమ అవార్డును ఏయిమ్స్ విసి నీలోత్పల్ బల్ చేతుల మీదుగా అందుజేశారు.



అవార్డును అందుకున్న శ్రేయారెడ్డి

# జుంటుపల్లి, కోట్‌పల్లి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

## రూ.15 కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు
## రైతులకు సాగునీరందించడమే ప్రభుత్వలక్ష్యం
## ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి





ప్రాజెక్టును పరిశీలించి మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**యాలాల, జులై 5, ప్రభాతవార్త :** తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పట్టువదలని విక్రమార్కుడిలా ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుంచి నియోజకవర్గంలోని కోట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులను పదే పదే సందర్శిస్తూ పరిశీలిస్తున్నారు. ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టునకు పూర్తి స్థాయిలో సాగునీరందివ్వడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే తన లక్ష్యంగా పెట్టుకున్న ఎమ్మెల్యే ప్రాజెక్టుల బాట పట్టడాన్ని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా శుక్రవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి నీటి పారుదల శాఖ అధికారుతో కలిసి యాలాల మండలంలోని జుంటుపల్లి ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టునకు సంబంధించిన కట్ట, కుడి ఎడమ కాలువలను, తూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ పదేళ్ల టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తాండూరు నియోజకవర్గంలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి సాగునీటి కల్పనకు పెద్ద పీట వేశారని ఆయన తెలిపారు. రైతులకు పుష్కలమైన సాగునీరందించి వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో జుంటుపల్లి, కోట్‌పల్లి ప్రాజెక్టుల మర్మత్తులకు గానుప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ కృషితో ఇప్పటికే కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మత్తులకు భారీగా నిధులు మంజూయ్యాయని, ఆయన కృషితోనే జుంటుపల్లి ప్రాజెక్టునకు కూడా నిధులు రాబడుతామని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల మరమ్మత్తులకు నోచుకోక ప్రాజెక్టుల పరిధిలో ఆయకట్ట భారిగా తగ్గిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 5వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే ప్రాజెక్టులు కనీసం 2వేల ఎకరాలకు సాగనీరందించని దుస్థితికి చేరుకోవడం రైతులకు శాపంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రాజెక్టు పరిధిల్లోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే రైతులకు భరోసా కల్పించారు. ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేపడతానని ఎమ్మెల్యే తెలిపారు.

ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ ప్రాజెక్టు మరమ్మత్తులకు సరిపడే నిధుల కోసం ప్రణాళికలు పంపు తామన్నారు. సుమారు రూ.15 కోట్లు అవసర మవుతాయని అధికారులు అంచనాకు వచ్చారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాగానే టెం డర్లు పిలిచి పనులు వేగవంతం చేస్తామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ ధర్మ, ఎస్ఇరంగారెడ్డి, ఈఈ సుందర్, డిఇఇ కిష్టప్ప, మాజీ ఎంపిపి కరణం పురుషోత్తంరావు, నాయకులుసురేందర్‌రెడ్డి, సిద్రాల శ్రీనివాస్, అక్బర్‌బాబా, హన్మంతు ముదిరాజ్, భీమప్ప, రవిగౌడు, బాల్‌రెడ్డి, అనీ ల్‌కుమార్, మహిపాల్‌యాదవ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి : అసెంబ్లీ స్పీకర్

**వికారాబాద్, జులై 5, ప్రభాతవార్త:** జిల్లాలో చేపడుతున్న నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని స్టేట్ చాంబర్ లో ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్మాణాల పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆసుపత్రి, కళాశాలకు అవసరమైన సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలో ప్రారంభించుకోనున్న ఆసుపత్రికి మౌళిక సదుపాయాలతో పాటు నీటి సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులపై ఆర్అండ్‌బీ అధికారులను సభాపతి అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఇంచార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డిఓ వాసుచంద్ర, ఆర్అండ్‌బీ ఇఇ లాల్‌సింగ్, మిషన్ భగీరథ ఇఇ బాబు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఆర్అండ్‌బీ డీఈ, ఏఈ లు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్



శశాంకకు పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలుకుతున్న జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, జులై 5 ప్రభాతవార్త :** జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ కె.శశాంక బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ పాలకవర్గం పదవీ కాలం పూర్తి కావడంతో కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ శుక్రవారం జిల్లా పరిషత్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఇతర అధికారులు కలెక్టర్ శశాంకకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.శశాంక

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, జులై 5 ప్రభాతవార్త :** వర్షాల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టడంతో పాటు, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై జిల్లా కలెక్టర్ కె.శశాంక జిల్లా వైద్యారోగ్య అధికారులు, మున్సిపల్ కమిసనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.శశాంక మాట్లాడుతూ...వర్షాల కారణంగా సంభవించే సీజనల్ వ్యా ధులు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, విషజ్వరాలు, మెదడు వాపు వంటి వాటిని అరికట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ సంసిద్ధంగా ఉండాలన్నారు. అదేవిధంగా వ్యాధుల పట్ల ప్రజల లో అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలు వ్యాధుల బారీ న పడకుండా ఉండేందుకు ముందుగా మున్సిపల్, పట్టణాలు, గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, ఎక్కడైనా నీరు నిల్వ ఉండే చోట ఆయిల్ బాల్స్ వేయాలని, అంతేకాక దోమలు రాకుండా ఫాగింగ్ చేయాలని, ప్రతి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం నుండి ప్రతిరోజు జ్వరాలపై నివేధిక సమర్పించాలని, ఏదైనా ప్రత్యేక ప్రాం తంలో జ్వరం కేసులు వచ్చినట్లయితే వాటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించి తక్షణమే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకురా వాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే నిర్వహించాలని, అన్ని, ఇండ్లు సంస్థలలో చేపట్టి నీటినంతటిని బయట పార బోసి దోమలు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. వ్య క్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను చేపట్టాల న్నారు. ఎక్కడైనా కేసులు వస్తే ప్రత్యేక శిభిరాలు ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. ఆర్‌బిఎస్‌కే బృం దాలు జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ కళాశాలలు, పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలను నిరంతరం సందర్శించి, విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించాలని ఆదేశించారు. పాఠశాలలో సైన్స్ టీచర్ల ద్వారా విద్యార్థులకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులపై పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారికి సూచించారు. గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ ప్రత్యేకాధికారులు ద్వారా తగు చర్యలు చేపట్టాలని పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్

## పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి కృషి
### పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్

**ఘట్‌కేసర్ రూరల్, జూలై 5, ప్రభాతవార్త:** పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలను పరిష్కారిస్తానని ఎమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. పోచారం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ బి. కొండల్ రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ పోచారం మున్సిపల్‌లో గల సమస్యలను తన దృష్టికి తేవాలని కోరారు. సమస్యలపై ఏ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు వచ్చిన పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్బంగా మున్సిపల్ చైర్మన్ బి.కొండల్ రెడ్డి ఎంపీకి వరంగల్ జాతీయ రహదారిపై ఎన్‌టీపీసీ చౌరాస్తా వద్ద బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని, మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఒక కోటీ 93 లక్షల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని సమావేశంలో తీర్మానించినట్లు చైర్మన్ తెలిపారు. మున్సిపల్‌లో బీటీరోడ్డు, సీసీ రోడ్లు, భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు నిధులు వినియోగించాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బందికి సబ్బులు, దుస్తుల కొనుగోలు కొరకు సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ పి. వేమన రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు జి. మహేశ్ కురుమ, నర్రిధనలక్ష్మి, చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, ఎ. శైలజ, ఎం. బాల్‌రెడ్డి, బి. వెంకటేశ్ గౌడ్, బి. హరిప్రసాద్‌రావు, సామల శ్రీలత, అబ్బవతి నర్సింహ, మోటుపల్లి పోచమ్మ, ఎన్. లక్ష్మీముదిరాజ్, ఎస్. సుధా లక్ష్మి, బి.మమత, కో ఆప్షన్ సభ్యులు అక్రం అలీ, శకుంతల మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
### ఎన్ఏఏఏ డైరెక్టర్ డాక్టర్ నంద దులాల్



విద్యా భోధనలపై అడిగి తెలుసుకుంటున్న ఎన్ఏఏఏ డైరెక్టర్ తదితరులు

**పెద్దేముల్, జులై 5, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నేషనల్ అకాడమీ ఆఫ్ అడిట్ అండ్ అకౌంట్స్ (ఎన్ఏఏఏ) డైరెక్టర్ డాక్టర్ నంద దులాల్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలో డిప్యుటి అకౌంట్ జనరల్ డాక్టర్ కామినేని సంజయ్‌రావుతో కలిసి పర్యటించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ రికార్డులు పల్లె ప్రకృతివనం, కంపోస్టు షేడ్, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో గ్రామ పంచాయతీల వ్యవస్థ పనితీరు, గ్రామీణ ప్రజల స్థితిగతులను అడిగి తెలుసుకోవడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు, త్రాగునీరు, పారిశుద్ధ నిర్వహణ, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామీణ ప్రాంతంలో అమలవుతున్న పలు ప్రభుత్వ విధానాలను డిఎల్‌పిఓ శంకర్ నాయక్ క్షుణ్ణంగా వివరించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యాసన సామార్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యాభోధన లభిస్తుందని అన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ యంపిఓ రమేష్, పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున్, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, సంజీవ్, శ్రీనివాస్, నరేష్, పరమేష్, యశ్వంత్ సిబ్బంది మల్లేశం తదితరులుపాల్గొన్నారు.

## నేడు సదరం కేంద్రాలకు స్లాట్స్

**వికారాబాద్, జులై 05, ప్రభాతవార్త:** జిల్లా వికలాంగులకు సదరం క్యాంపునకు సంబంధించి శనివారం ఉదయం 11 గంటలకు సదరం కేంద్రాలకు స్లాట్స్ పెట్ట బడుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12,23,24,30,31 తేదీల్లో తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే క్యాంపులకు స్లాట్ బుక్ చేసుకున్న అంగవైకల్యం, బుద్ధి మాంధ్యత, చెవుడు, మూగ కల దరఖాస్తుదారులు హాజరుకావాలని సూచించారు. 9, 16,19,25 తేదీలలో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో నిర్వహించే క్యాంపులకు అంగ వైకల్యం, అంధులు హాజరుకావాలని తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఇది వరకు పొంది సర్టిఫికేట్ కాల పరిమితి అయి పోయిన వారితో పాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకొన్న వారు హాజరు కావాలని పేర్కొన్నారు. మొత్తం 650 స్లాట్స్ అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

# హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య మంచి భోజనం అందించాలి

## గిరిజన సంక్షేమశాఖ సెక్రటరీ డాక్టర్ శరత్



సమావేశంలో మాట్లాడుతున్న శరత్

**వికారాబాద్, జులై 05, ప్రభాతవార్త:** గురుకుల ఆశ్రమ, గిరిజన హాస్టళ్ళలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మంచి భోజనం అందించాలని గిరిజన సంక్షేమ సెక్రటరీ డాక్టర్ ఎ.శరత్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో గురుకుల, గిరిజన హాస్టల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పిల్లలు ఎవరైతే పరీక్షలు రాసి లిస్ట్‌లో పేర్లు ఉన్న వారికి మొదటి ప్రాదాన్యత ఇచ్చి అడ్మిషన్స్ ఇవ్వాలని, ఖాళీలు లేకుండా చూడాలని అన్నారు. పాత టెండర్ల ను పిలిచి ఈ నేలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో క్లస్టర్ వారిగా వంట వారిని గుర్తించి వారికీ శిక్షణ నివ్వాలని తెలిపారు. పిల్లలకు పెట్టె భోజనం సరిగా లేకపోతె పిల్లల ఆరోగ్యం పాడవుతుందని, పిల్లల ఆరోగ్యము పై దృష్టి సారించాలని అన్నారు. హాస్టళ్ళను సరైన విధంగా నిర్వహించాలని, హాస్టళ్లలో కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని, ప్రభుత్వం నిర్దేశించిన టైం ప్రకారం ఉండాలని అన్నారు. జిల్లాలో హాస్టళ్ళు, కేజీబీవీలు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు తన దృష్టికి రాకూడదని, ఎట్టి పరిస్థితులలో హాస్టల్ నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. భోజనం విషయంలో ఎక్కడ రాజీ పడవద్దని, సన్న బియ్యం సంఘరా అయ్యేలా సివిల్ సప్లయ్ అధికారులు చూడాలని తెలిపారు. హాస్టళ్లలో చిన్న చిన్న మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలని, హాస్టల్ విద్యార్థులకు డ్రెస్ లు కుట్టించి అ ఎకున్న టైం లోపల పంపిణి చేయాలనీ ఆదేశించారు. బదిలీల జీవో వచ్చినందున జిల్లా స్తాయిలో అధికారులు అందరు సమావేశము ఏర్పాటు చేసుకొని ఆప్షన్ తీసుకొని పోస్టింగ్ ప్రిపేర్ చేయాలన్నారు. ప్రతి హాస్టల్, గురుకులాలల్లో ఒక ఏఎన్ఎం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌సీఓ స్కూల్స్ వారిగా రిజిస్టర్ పెట్టి సిక్ అయిన పిల్లల పేర్లు నమోదు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను తొలగిస్తామని, అవసరమైన సౌకర్యాలని కల్పిస్తామని, తద్వారా వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. తాగునీటిపైన ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని, హాస్టళ్ళు, కేజీబీవీ పాఠశాలలకు నాణ్యమైన బియ్యం వచ్చేలా చూస్తామని తెలిపారు. తాగు నీరు, శానిటేషన్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని, అన్ని విషయాలపై దృష్టి సారించి పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ చందన, ఎస్సి వెల్ఫేర్ హేమలత, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్‌లో అంగన్‌వాడీల ఆందోళన

## సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

**కొడంగల్, జూలై 5ప్రభాతవార్త** అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాల సమస్యలు పరిష్కారించాలంటూ శుక్రవారం కొడంగల్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వికారాబాద్, నారాయణపేట్, మహబుబ్‌నగర్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కొడంగల్‌కు చేరుకున్నారు. పైగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటన ఉందని సమాచారం అందడంతో ముఖ్యమంత్రి నివాసానికి వెళ్ళే దారిలో బస్టాండ్ ముందు వందల సంఖ్యలో అంగన్‌వాడి కార్యకర్తలు చేరుకొని ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతు గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ 10ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద అంగన్‌వాడీ టీచర్‌కు రూ. 2లక్షలు, ఆయాకు రూ. 1లక్ష అందించాలని, వీఆర్ఎస్‌ను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా ముఖ్యమంత్రి డౌన్‌డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. అంగ్‌వాడీ కార్యకర్తల ధర్నా విషయం తెలుసుకున్న డిఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీధర్‌రెడ్డిలు అక్కడికి చేరుకొని వారి నచ్చజెప్పెందుకు ప్రయత్నించడంతో పాటు ధర్నాను తొలగించేందుకు పోలీస్ సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ పోలీసులతో పాటు వికారాబాద్‌కు చెందిన మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై లక్ష్మీ తన మహిళా కానిస్టేబుల్‌లు సిబ్బందితో అంగన్‌వాడీల ధర్నా తీసివేసేందుకు ప్రయత్నించారు. డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి వారికి నచ్చజెప్పెందుకు ప్రయత్నించినా అంగన్‌వాడీ టీచర్లు ససేమిరా సమ్మతించలేదు. దీంతో మహిళా పోలీసులు రంగంలోకి దిగి ఒక్కొక్కరిని ఈడ్చుకొని వెళ్ళి పోలీసు వాహనంలో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వందలాది మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ధర్నాలో పాల్గొనడంతో తక్కువగా ఉన్న మహిళా పోలీసు సిబ్బంది ధర్నాను తొలగించేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. ఒకొక్కరిని ఈడ్చుకొని వెళ్తున్న సమయంలో పలువురి అంగన్‌వాడీ కార్యకర్తల గాజులు పగిలిపోయయి చిన్నపాటి గాయాల పాలైయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి కొడంగల్‌కు చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మరోపక్క నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను పురస్కరించుకొని ఐజీ సుధీర్‌బాబు కొడంగల్‌లో పర్యటించి పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు.



కార్యకర్తలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

### పోలీసుల వైఫ్యలంపై విమర్శలు

కొడంగల్ నియోజకవరర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన పోలీసు యంత్రాంగం వైఫల్యం చెందిందని పలవురు విమర్శిస్తున్నారు. ఓపక్క సీఎం పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి భద్రత చేపట్టాల్సిన పోలీసులకు అంగ్‌వాడీ టీచర్లు, ఆయాల ధర్నా విషయం తెలిసినా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. వందలాది మంది అంగ్‌వాడీ టీచర్లు కొడంగల్‌కు చేరుకొని రోడ్డుపై ధర్నా చేస్తున్న ఎక్కడికక్కడే అడ్డుకోవాల్సిన పోలీసులు ఆలస్యంగా తేరుకున్న పోలీసులు హుటాహుటినా జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక పోలీసు బలగాలతో పాటు మహిళా పోలీసు సిబ్బందిని రప్పించి పరిస్దితిని అదుపులోకి తీసుకువచ్చారు.

## ప్రతి ఒక్కరు మితంగా ఆహారం తీసుకోవాలి
### -పద్మశ్రీ అవార్డుగ్రహీత డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే


పద్మశ్రీ అవార్డుగ్రహీత డాక్టర్ ఏ.గోపాలకృష్ణ గోఖలేను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూలై 5 ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండడానికి ఉత్తమమైన ఆహార అలవాట్లతో ముందుకు సాగితే జీవితం ఆనందకరంగా ఉంటుందని పద్మశ్రీ అవార్డుగ్రహీత, ప్రముఖ హృద్రోగ వైద్యనిపుణులు, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మల్టీఆర్గన్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ ఏ.గోపాలకృష్ణ గోఖలే అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం జరిగింది. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరు కాగా కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ ఎస్.మురళీకృష్ణ, బబ్లూ(వెంకటకృష్ణ), మన్నె దామోదర్‌రెడ్డి, వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు బి.వెంకటస్వామి, వివేక్, సంతోష్‌గౌడ్, ప్రవీణ్, రాజు, సునీల్‌కుమార్, పద్మ, రత్నాకర్‌రెడ్డి, చందు, పైడి రాజు, మురళీ పంతులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పార్కులో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ గోపాలకృష్ణగోఖలే మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించాలనుకునే మితంగా ఆహారం తీసుకోవడంతో పాటు ప్రతిరోజు వ్యాయామం చేయడం అలవాటుచేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై దృష్టిని సారించాలన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ గోపాలకృష్ణ గోఖలేని ఘనంగా సత్కరించారు.

### బోనాల జాతర, గురుపౌర్ణమి సందర్భంగా గురువులకు అవార్డులు

**చిక్కడపల్లి, జూన్ 5 ప్రభాతవార్త:** తెలంగాణ బోనాల జాతర, గురుపౌర్ణమి సందర్భంగా 'గురువులకు అవార్డులు' ప్రదానం చేయాలని నిర్ణయించిన భారత్‌ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు, జైజవాన్ జై కిసాన్ జై కళాకార్ అధినేత కె.వి.రమణరావు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, గురువులకు అవార్డులను అందిస్తామని, అన్ని కళారూపాల ప్రదర్శనలు, మాస్టర్లకు అవార్డులను ఇవ్వాలని నిర్ణయించాలని, ఇందుకోసం కళాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తులకు ఆఖరి తేదీ జూలై 5వ తేదీ అని, ఇతర వివరాలకు 7207177000 ద్వారా ఇతర వివరాలు పొందవచ్చని తెలిపారు.

## గుంతల రోడ్లను ఆధునీకరించేందుకు చర్యలు
### -కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, జూలై 5 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లో గుంతలమయంగా ఉన్న రోడ్లను ఆధునీకరించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీవినయకుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా గురువారం డివిజన్ పరిధిలోని కెనరా బ్యాంక్ లేన్, మోర్ సూపర్ మార్కెట్ పరిధిలో గుంతలమయంగా రోడ్లు ఉన్నాయని స్థానికులు చేసిన ఫిర్యాదుమేరకు సంబంధిత అధికారులతో సమీక్షించి దెబ్బతిన్న రోడ్లను తిరిగి ఉపయోగించుకునే విధంగా చర్యలు చేపట్టడంతో ప్రజలు, వాహనదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వర్షాకాలం కూడా వస్తుండడంతో తక్షణ చర్యల్లో భాగంగా 'జెట్‌ప్యాచ్ వర్క్' ద్వారా రోడ్ల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామని, అంతేకాకుండా నూతన రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఏర్పాటుతో డివిజన్‌ను మరింత అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్పొరేటర్ ఆదేశాల మేరకు బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బిజెపి నాయకులతో కలిసి జెట్‌ప్యాచ్ వర్క్ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేశ్, బిజెపి నాయకులు సాయికుమార్, లక్ష్మణ్ యాదవ్, ఆనంద్‌రావు, జ్ఞానేశ్ పాల్గొన్నారు.

## ఐటీ కట్టే రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలి


నార్సింగి సహకార సంఘం సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ తోల్‌కట్ట కృష్ణ

**నార్సింగి, జూలై 5 ప్రభాతవార్త :** ఐటీ కట్టే రైతులకు కూడా రైతు భరోసాను ఇవ్వాలని నార్సింగి సహకార సంఘం చైర్మన్ తీర్మానించింది. శుక్రవారం నార్సింగి సహకార సంఘం సమావేశం నిర్వహించి, రైతుల అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా తీసుకున్నారు. ఇందులో 98.శాతం మంది రైతులు ఆదాయపు పన్ను కట్టుకొని, భూములు సాగు చేస్తున్న రైతులకు, 5.ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు రైతు భరోసాను ఇవ్వాలని లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ తోల్‌కట్ట కృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు, రైతు భరోసా పతకాలు అమలు చేయాలని కోరారు. సాగు చేయని భూమికి, ఐదెకరాల పైనున్న వారికి రైతు భరోసాను నిలిపి వేయడం న్యాయమైన విషయమేనని తెలిపారు. రైతులను ఆదుకుంటేనే రాష్ట్ర ప్రజలకు అవసరమైన ఆహార పదార్థాలు, కూరగాయలు పండించే వీలుందని, రైతులను విస్మరిస్తే ఆహార ధాన్యాల కొరత ఏర్పడే ప్రమాదముందని కృష్ణ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ డిసిఒ ఆర్‌ఎంవి.ఆనంద్‌రావ్, మాజీ చైర్మన్ పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ప్రతినిధులు శివరాజ్, డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, రైతులు భూపాల్‌రెడ్డి రాములు, గండయ్య, రాజేందర్, గణేష్, కొమురయ్య, లక్ష్మయ్య, శంకరయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### హెచ్‌ఎండిఏ కమిషనర్‌కు శుభాకాంక్షల వెల్లువ


హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను సిటిజెన్స్ కౌన్సిల్ సభ్యులు.

**నార్సింగి, జూలై 5 ప్రభాతవార్త :** హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు మణికొండ ప్రాంతానికి చెందిన సిటిజెన్స్ కౌన్సిల్ సభ్యులు ఆరిఫ్ మహ్మద్, ఉపేందర్‌నాథ్‌రెడ్డిలు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపల్ అవినీతికి మారు పేరుగా మారిందని, పార్కు స్థలాలు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని హెచ్‌ఎండిఏ చైర్మన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. హెచ్‌ఎండిఏ అనుమతి పొందిన లేఔట్ లోని రహదారులకు రెండు వైపులా ప్లాట్ యజమానులతో ఒప్పందం కుదుర్చుకొని కబ్జా చేసుకుంటున్నారన్నారు. అనుమతులు పొందిన వాటికన్నా అధికంగా నిర్మాణాలు జరుగుతున్నాయని, కట్టడాలు పూర్తి కాకుండానే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు ఇస్తున్నారన్నారు. ఆంబియన్స్ కోర్టు అపార్టుమెంట్‌లోని డ్రైనేజీని పందెన్‌వాగులో కలిపేందుకు ప్రయత్నం చేస్తున్నారని, చట్ట విరుద్ధమైన పనులను అడ్డుకోవాలని కమీషనర్‌ను కోరామని వివరించారు. మేము తెలిపిన అన్ని సమస్యలు కమీషనర్ సావధానంగా విన్నారని, త్వరలోని అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీనిచ్చారని కౌన్సిల్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ్ల తెలిపారు.

# సినీఫక్కీలో ఆపరేషన్ పార్థా గ్యాంగ్

**-నగరంలో మరో దొంగల ముఠా**
**-తెల్లవారుఝామునే దోపిడీలు చేస్తారు**
**-చేజింగ్ చేసి పట్టుకున్న పోలీసులు**

**హైదరాబాద్, జూలై 05, ప్రభాతవార్త:** భాగ్యనగరంలో అంతర్రాష్ట్ర ముఠాలు మరోసారి చెలరేగాయి. మొన్న చెడ్డీ గ్యాంగ్, నిన్న థార్ గ్యాంగ్, తరువాత భవారియా ముఠాలు వరుస దాడులు, దొంగతనాలు, దారి దోపిడీలతో, స్నాచింగ్‌లతో రెచ్చిపోయారు. తాజాగా పార్థాగ్యాంగ్ నగరంలో హల్‌చల్ చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రాల్లో వరుస దోపిడీలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న పార్థా ముఠాను శుక్రవారం తెల్లవారుఝామున సినీఫక్కీలో తెలంగాణ పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. రాబరీలో ఆరితేరిన ఈ దొంగల ముఠా పెట్రోల్ బంకులు, ఇళ్ళు, బ్యాంకులను కొల్లగొట్టడంలో సిద్ధహస్తులు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో వరుస దోపిడీల్లో ఈ ముఠాపై పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి.

**నిఘా పెట్టిన పోలీసులకు పారిపోతూ చిక్కారు:**
హైదరాబాద్ సివారుల్లో గత కొద్ది రోజులుగా పార్థాగ్యాంగ్ దోపిడీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే వీరిపై నగర పోలీసులు నిఘా ఉంచిన క్రమంలో నల్గొండ పోలీసులు ఛేజ్ చేస్తూ వచ్చారు. ఇటీవలె కాలంలో విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలను టార్గెట్ చేస్తూ దారి దోపిడీ దొంగలు చెలరేగిపోయారు. వీరిని పట్టుకోవడానికి నల్గొండ జిల్లా పోలీసులు ప్రత్యేక బృందాలుగా విడిపోయి మరీ నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుఝామున హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఒక వ్యానులో పారుపోతున్న పార్థా గ్యాంగ్ పోలీసుల కంట పడ్డారు. దాంతో అప్రమత్తమైన నల్గొండ పోలీసులు నాలుగు బృందాలుగా విడిపోయి నార్కట్‌పల్లి నుంచి వారి కదలికలను గమనించి వెంబడిస్తూ వచ్చారు. నల్గొండ పరిధి దాటి రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలోకి దొంగల ముఠా ప్రవేశించగా, ఛేజ్ చేస్తున్న నల్గొండ పోలీసులు సమాచారమందించడంతో హైదరాబాద్ పోలీసులు రంగంలోకి దిగారు. నల్గొండ పట్టణంలో దొంగతనం చేసి, వ్యాన్‌లో తప్పించుకు పారిపోతుండగా ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద పెద్ద అంబర్ పేట ప్రాంతంలో సినిమా లెవెల్‌లో వారిని పోలీసు బృందాలు తరిమాయి. ఈ క్రమంలో పోలీసులు చుట్టు ముట్టగా పార్థాగ్యాంగ్ ఎదురు దాడికి దిగారు. దొంగల ముఠా కత్తులతో తెగబడడంతో పోలీసులు కొన్ని రౌండ్లు గన్ ఫైర్ చేశారు. ఛేజ్ చేసే క్రమంలో నలుగురు ముఠా సభ్యులు పోలీసులకు చిక్కారు.

**ఆదివాసీలు కిరాతకులుగా మారారు:**
తెల్లవారుఝామున సమయంలో మాత్రమే దోపిడీలకు పాల్పడే పార్థా గ్యాంగ్ సభ్యులు పేస్ పార్థి అనే గిరిజన తెగకు చెందిన వారుగా తెలుస్తోంది. గుజరాత్‌లోని దవోద్ జిల్లాలో నహేడా అనే గ్రామానికి చెందిన గిరిజనులే పార్థా గ్యాంగ్‌గా రూపాంతరం చెందినట్లు సమాచారం. వీరు నేర ప్రవృత్తిని ఎంచుకోక ముందు అడవిలోని పోడు భూముల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. అడవి జంతువులను వేటాడడం వీరి ప్రధాన వృత్తి. మొదట్లో వీరు ఎలాంటి నేరాలూ చేయకుండా తమ వృత్తినే నమ్ముకుని బ్రతికేవారు. ప్రకృతి విపత్తుల వల్ల వ్యవసాయం వీరికి కలిసి రాకపోగా, వన్య మృగాలను వేటాడడం ప్రభుత్వం నిషేధించింది. దాంతో వీరికి బ్రతుకు తెరువు కరువై దిక్కుతోచని స్థితి ఏర్పడగా, వారి తెగపెద్ద అయిన రామ్‌జీ అనే వ్యక్తి ఐదుగురు సభ్యులతో దొంగల ముఠాను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చినట్లు పోలీసు రికార్డుల్లో నమోదయింది. వృద్ధుడైన రామ్‌జీ చెప్పిన నేర సూత్రాలు తప్పకుండా పాటిస్తారని, తమ ముఠాలో ఎవరైనా పోలీసులకు పట్టుబడితే హింసను తట్టుకుంటారు తప్ప ఇతర సభ్యుల వివరాలు బయట పెట్టరని పోలీసులు తెలిపారు. తమ తెగను కాపాడుకునేందుకు నేరప్రవృత్తిలోకి వచ్చిన ఈ గిరిజనులు క్రమంగా పదుల సంఖ్యలో వృద్ధి చెంది వరుస నేరాలకు పాల్పడుతున్నారన్నారు. తొలుత ఏడుగురు సభ్యులతో ఈ ముఠా ఉండేదని తెలిసింది. దోపిడీలు చేసే సమయంలో ఒళ్ళంతా నూనె రాసుకుని బట్టలు లేకుండా చెడ్డీలు ధరించి చోరీలకు పాల్పడే ప్రక్రియ ఈ ముఠానే మొదలు పెట్టింది. కాగా ఆరంభంలో చెడ్డీ గ్యాంగ్ వీరితో కలిసి ఉండేది. క్రమంగా అది వేరు పడడంతో పార్థా గ్యాంగ్ తమ పంథాలో దోపిడీలు చేస్తున్నారు. 1987లో ప్రారంభమైన వీరి నేరాలు 1999లో వెలుగు చూశాయి. మొదట్లో ఉత్తరాది రాష్ట్రాల్లో దోపిడీలు చేసే పార్థా గ్యాంగ్ అక్కడ కేసులు పెరిగి ప్రజలు అప్రమత్తమవ్వడంతో దక్షిణాది రాష్ట్రాల్లో తమ నేర పరంపర కొనసాగిస్తూ వస్తున్నారు. సీసీ కెమేరాలు వచ్చాకా వారి వేష భాషలు, చేసే అకృత్యాలు బయట పడ్డాయి.

**వీరి కన్ను పడిన నగరానికి ముప్పే:**
పార్థా గ్యాంగ్ కన్ను ఏ నగరం పైన పడితే ఆ నగరానికి నెల ముందే చేరుకుని వివిధ ప్రాంతాల్లో పలు రకాలుగా రెక్కీలు నిర్వహిస్తారని పోలీసులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో తాము టార్గెట్ చేసిన ఇళ్ళ పైన రాత్రంతా వేచి ఉండి తెల్లవారుఝామున దోపిడీలకు తెగబడతారు. టార్గెట్ చేసిన ఇంట్లోకి చొరబడినప్పుడు ఎవరైనా వారిని చూస్తే తక్షణమే దాడి చేసి రక్త పాతం సృష్టించిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. వేరు వేరు భాషలు మాట్లాడుతూ బెడ్ షీట్లు అమ్మే వారిగా, వెంట్రుకలు సేఖరించేవారిగా వీరు టార్గెట్ చేసిన నగరాల్లో వీధి వీధీ తిరుగుతుంటారని నగర పోలీసులు హెచ్చరించారు. అనుమానితులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారమందించమని ప్రజలకు సూచించారు.

## ఉద్యోగులకు న్యాయం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వీరేష్‌బాబు

**సైఫాబాద్, జులై 5 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వైద్య విధాన్ పరిషత్‌ను రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీస్‌గా మార్చాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవాంహిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో యూనియన్ హైదరాబాద్ జిల్లా కార్య వర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌బాబు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డిఎల్, పిర్సిని త్వరలోనే ప్రకటించాలని, జివొ నెంబరు 317 ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం జరగకముందే ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులను జారీ చేయడం అన్యాయమన్నారు. తెలంగాణ వైద్య విధాన్ పరిషత్‌లో 317 అలోకేషన్ అయిన పూర్తియి ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభించాలనే సమయంలో బదిలీ ఉత్తర్వులు రావడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని వారు తెలిపారు. తక్షణమే ఉద్యోగులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఆరోగ్యమ్మ, సైదమ్మ, సుజాత, అజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలి


రహ్మత్‌నగర్‌లో రోడ్డు వెడల్పు పనుల కోసం ప్రణాళికను పరిశీలిస్తున్న జిహెచ్‌ఎంసి జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి, కార్పోరేటర్ సిఎన్‌రెడ్డి.

**యూసుఫ్‌గూడ, జూలై 05, ప్రభాతవార్త**
రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా జిహెచ్‌ఎంసి అధికారులు త్వరితగతిన దృష్టి సారించాలని రహ్మత్‌నగర్ కార్పోరేటర్ సిఎన్ రెడ్డి అన్నారు.శుక్రవారం డివిజన్ పరిధిలో హెచ్‌ఎఫ్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సామాజిక భవనాన్ని జోనల్ కమీషనర్‌తో కలిసి పరిశీలించారు.పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అదేవిధంగా ఎన్నో ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న యూసుఫ్‌గూడ నుంచి రహమత్‌నగర్ వరకు రోడ్డు వెడల్పు పనులు కూడా చేపట్టాలని కోరారు. అందుకు సంబంధించిన ప్రణాళికలను పరిశీలించారు.తొందరలోనే వీటి విషయమై కమీషనర్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు.ఈకార్యక్రమంలో డిసి సేవా ఇస్లావత్, ఇ.యి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించండి : బండి రమేష్


మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 5, ప్రభాతవార్త**
కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని తెలంగాణ రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబును కూకట్‌పల్లి ఇంచార్జీ బండి రమేష్ కలిసి విజ్ఞప్తి చేశారు. బండి రమేష్ శుక్రవారం ఐటీశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబును ఆయన పేషీలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి సంబంధించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై రమేష్ మంత్రితో చర్చించారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన పదికోట్ల రూపాయల పనుల ప్రారంభోత్సవానికి మంత్రిని రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈనెల 10 తర్వాత ఎప్పుడైనా మంత్రి రానున్నట్లు బండి రమేష్ పేర్కొన్నారు.

### ఏఎంహెచ్‌ఓ సల్మాన్ రాజు వేధింపులపై కాంగ్రెస్ నేతలకు ఫిర్యాదు

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 5, ప్రభాతవార్త**
కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపేట ఏఎంహెచ్‌ఓ సాల్మన్‌రాజు వేధింపులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఏలు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్‌కి ఫిర్యాదు చేశారు. శుక్రవారం బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విధులు సక్రమంగా నిర్వహిస్తున్న తమను వేధింపులకు గురి చేస్తున్నారని పలువురు ఉద్యోగులఉ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రమేష్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్ళి ఎస్‌ఎఫ్‌ఏలకు తగిన న్యాయం చేస్తామని హామి ఇచ్చారు.



నగరంలో జరిగిన హైలైఫ్ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## మహిళలు ముందు తరాలకు ఆదర్శంగా ఉండాలి
### -జన శిక్షణ సంస్థాన్ కార్యక్రమ అధికారి మాలకొండయ్య


శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందచేస్తున్న అధికారి మాలకొండయ్య

**ముషీరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెంది, ముందు తరాలకు ఆదర్శవంతంగా ఉండాలని జన శిక్షణ సంస్థాన్ కార్యక్రమ అధికారి మాలకొండయ్య సూచించారు. శుక్రవారం అప్స స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ జన శిక్షణ సమస్థాన్ సహకారంతో దోమలగూడలోని బండనగర్ కమ్యూనిటీ హాల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందచేశారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ మా సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం దాదాపు 1800 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చి వారికి ధ్రువ పత్రాలు అందచేస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో సుమారు 15 రకాల శిక్షణలు మహిలలకు ఉచితంగా అందించటం జరుగుతోందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదిగినప్పుడే సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు వస్తుందని అన్నారు. అప్సా కార్యకర్త బొట్టు రమేష్ మాట్లాడుతూ అప్స సంస్థ ద్వారా బస్తీలలో వివిధ శిక్షణలు ఇవ్వటమే కాకుండా వారికి ఉద్యోగావకాశాలు కలిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఇచ్చిన టీచర్లు అరుణ, రజిత, పుష్పలీల, అప్సా ప్రతినిధులు శ్రావణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

### నిర్మాణ కార్మికుల జీవితాలను దెబ్బతీస్తున్న ప్రధాని మోడీ

**సైఫాబాద్, జులై 5 ప్రభాతవార్త:** దేశ నిర్మాణంల కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులు హక్కులను, జీవనోపాధిని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తున్నదని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ఆరోపించారు. ముఖ్యంగా అసంఘటిత కార్మికులకు ఉపాధి, సరైన ఆదాయ వనరులు దక్కక దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా 3వ మహాసభలో ఆయన ప్రసంగించారు. సమాజంలో మౌలిక సదుపాయాలను నిర్మించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న నిర్మాణ కార్మికులకు తగిన కూలీ, సామాజిక భద్రత, ఆరోగ్య సంరక్షణ కల్పించడంలో సురక్షితమైన పని వాతావణాన్ని మెరుగుపరచడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఆయన ఆరోపించారు. ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా మాట్లాడుతూ గత 5 సంవత్సరాల నుంచి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పనిచేయకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురైనారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభకు చెట్టుకింద శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ఎఐటియుసి నేతలు ఉజ్జిని రత్నాకర్‌రావు, పల్లా దేవేందర్‌రెడ్డి, మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్, కమతం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### కనువిందుగా కనకదుర్గ భరతనాట్య నృత్యవిభావరి

**రవీంద్రభారతి, జులై 5 ప్రభాతవార్త :** ప్రముఖ సాంస్కృతిక సంస్థ కనకదుర్గ నృత్యవిభావరి ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో సంస్థ 42వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ శిష్య నృత్యకుసుమాలతో భరత నాట్య ప్రదర్శన కనువిందుగా నిర్వహించనున్నట్లు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు, సంస్థ డైరెక్టర్, ప్రఖ్యాత నాట్యగురువు లయన్ నిర్మలా ప్రభాకర్ శుక్రవారం మీడియాకు తెలిపారు. ఈ నెల 8 సోమవారం సాయంత్రం 5.30నుండి సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన జరిగే సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, విశిష్ట అతిథులుగా డా. మామిడి హరికృష్ణ, ఆచార్య భట్టురమేష్, నాట్యగురువులు అంబుబాబు, భాగవతుల సేతురాములు, గౌరవ అతిథులుగా జి.వెంకట్‌రెడ్డి, లంక లక్ష్మీనారాయణ, డా. మహ్మద్‌రఫీ తదితరులు పాల్గొంటారని నిర్మలా ప్రభాకర్ వివరించారు.

### 7న సికింద్రాబాద్‌లో "జగన్నాథ రథయాత్ర "

**హైదరాబాద్, జూలై 5,ప్రభాతవార్త:**
ప్రతిసంవత్సరం శ్రీజగన్నాథ స్వామి రాంగోపాల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో పూరీలో జరిగే జగన్నాథ రథయాత్రతో పాటుగా నగరంలో జగన్నాథ భగవానుడు, బలభద్రుడు, సుభద్ర దేవతల రథయాత్రను నిర్వహిస్తుంది. సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని జగన్నాథ దేవాలయం ట్రస్ట్ నిర్వాహణలో గత 130ఏళ్లుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్టీ పురుషోత్తం మలాని మాట్లాడుతూ ప్రతిఏటా భగవంతుని రథోత్సవాన్ని ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. సికింద్రాబాద్ -జంటనగరాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరై భగవంతుని ఆశిస్సులు పొందుతారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 7న (ఆదివారం )నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 6గంటల ఆలయ ద్వారా దర్శనం కోసం తెరవబడతాయని మధ్యాహ్నం 1.గంటలకు మూసివేయబడతాయన్నారు. ఆతర్వాత సాయంత్రం రథయాత్ర ఊరేగింపు ప్రారంభమై జనరల్ బజార్ మీదుగా ఎమ్‌జిరోడ్‌లో కొనసాగుతుందని తెలిపారు. అనంతరం రాత్రి 6.30నుంచి 10.30వరకు హిల్‌స్ట్రీట్ ,రాణిగంజ్ గుండా వెళ్ళి మరుసటి రోజు ఉదయం 4గంటలకు తిరిగి ఆలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు.

## రావూరి భరద్వాజ జీవిత చరిత్ర అందరికీ ఉదాహరణ : జస్టిస్ శేషశయనారెడి


ఆచార్య టి.గౌరీశంకర్, సురేఖామూర్తిలకు పురస్కారాలను అందిస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి, చిత్రంలో గుదిబండి వెంకటరెడ్డి, చెన్నయ్య, కోటేశ్వరరావు తదితరులు

**చిక్కడపల్లి, జూలై 5ప్రభాతవార్త:** జీవితలక్ష్యాలను ఏ విధంగా చేధించాలంటే రావూరి భరద్వాజ జీవిత చరిత్ర ఉదాహరణ అని ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.శేషశయనారెడ్డి అన్నారు. జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుదిబండి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆచార్య టి.గౌరీశంకర్‌కు జ్ఞానపీఠ పురస్కారగ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారాన్ని, నంది అవార్డు గ్రహీత డి.సురేఖామూర్తికి రావూరి కాంతమ్మ స్మారక సంగీత సేవా పురస్కారాలను అందించే కార్యక్రమం తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య అధ్యక్షతన గురువారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.శేషశయనారెడ్డి పురస్కారాలను అందించి గౌరవించి ప్రసంగించారు. రావూరి భరద్వాజ కంఠం కంచుమోగినట్లు ఉంటుందని, తెలుగును ఏ విధంగా ఉచ్చరించాలి, మాటాడాలి అనేటివంటి విషయాలను తెలుసుకోవాలంటే రావూరి భరద్వాజను చూసి నేర్చుకోవాలన్నారు. జీవితమంటే పూలపాన్పు కాదు, ఎస్కలేటర్ కాదు, కష్టపడి మెట్టుమెట్టు ఎక్కి ఉన్నతస్థాయికి చేరి గమ్యస్థానానికి చేరుకోవడమనేది రావూరి భరద్వాజ చరిత్ర ఆదర్శంగా నిలుస్తారన్నారు. భరద్వాజ తనకున్న క్యారెక్టర్‌ను నిలబెట్టుకుని పనిచేశారని, ఆయన రచనల ద్వారా ఇంకా గుర్తుచేసుకుంటున్నామన్నారు. శిల్పశాస్త్రంలో ప్రవీణులు ఈమని శివనాగిరెడ్డి మాట్లాడుతూ పాకుడురాళ్ళు ఉన్నంత కాలం రావూరి భరద్వాజ అందరి హృదయాల్లో నిలిచి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రావూరి భరద్వాజ, రావూరి కాంతమ్మ ట్రస్ట్ ప్రతినిధి రావూరి వెంకట కోటేశ్వరరావు, గాయకుడు ఆర్.సైదులు, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వి.వి.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు శ్యామగాయత్రి మ్యూజిక్ అకాడమి అధినేత్రి, సంగీత గురువు చిల్లా శివపార్వతి నిర్వహణలో సంగీత విభావరి, కూచిపూడి నృత్యంను శేషబట్టార్ ఆరోహి శరణ్య అద్భుతంగా ప్రదర్శించారు.

## 7న నిజాంపేట నుంచి శ్రీజగన్నాథ రథయాత్ర ప్రారంభం


సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మహాష్రి ంగ్

**సైఫాబాద్, జులై 5 ప్రభాతవార్త:**
ఇస్కాన్ కుకట్‌పల్లి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన 'శ్రీజగన్నాథ రథయాత్ర-2024' ఉత్సవం నిర్వహిస్తున్నామని ఆ సంస్థ అధ్యక్షుడు హెచ్.జి.మహాష్రింగ్‌దాసా తెలిపారు. ఈ రథయాత్ర 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు నిజాంపేటలోని శ్రీమైసమ్మ ఆలయం నుంచి ప్రారంభమవుతుందని శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. అక్కడ నుంచి కుకట్‌పల్లి, జెఎన్‌టియు, వివేకనంద విగ్రహం మెయిన్ రోడ్ మీదగా బిజెపి కార్యాలయం, మెట్రో షాపింగ్‌మాల్ వెనుక ఉన్న హుడా ట్రక్ పార్కింగ్ వరకు కొనసాగుతుందన్నారు. ఈ రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొంటారని. యాత్రలో ట్రాఫిక్‌ను సమన్వయం చేసేందుకు 500 మంది యువత పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ జగన్నాథ యాత్ర కమిటీ చైర్మన్‌గా అంజనీకుమార్ ఆగర్వాల్, మనీష్ ఆగర్వాల్, పురుషోత్తం ఆగర్వాల్ నియమితులైనట్లు చెప్పారు. ఈ రథయాత్రకు దక్షిణాఫ్రికా, రష్యా, ఉక్రెయిన్ తదితర దేశాల నుంచి 12 మంది గల బృందం హాజరవుతుందని శ్రావ్యమైన కీర్తనలు, వివిధ సంగీత వాయిద్యాల నడుమ ఆహ్లాదాకరమైన వాతావరణంలో శ్రీజగన్నాథ రథయాత్ర ఉత్సవం ఆధ్యాత్మిక రీతిలో కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో ఇస్కాన్ ప్రతినిధులు అంజనీకుమార్ ఆగర్వాల్, పురుషోత్తమ్ ఆగర్వాల్ పాల్గొన్నారు.

## భర్తతో గొడవపడి మహిళ అదృశ్యం

**ముషీరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** భర్తతో గొడవపడి ఒక మహిళ ఇంటి నుండి వెళ్లిపోయిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ డి.రాజు తెలిపిన వివరాల ప్రకారం శత్రాసిపల్లి సురేష్ (38), శైలజ (30) ఇద్దరు పిల్లలతో కలసి గాంధీనగర్‌లో నివసిస్తున్నారు. ఈనెల 3వ తేదీ శైలజ గూగుల్‌పేకు ఆమె మామయ్య కొంత డబ్బు పంపించటంతో సురేష్ అతని వద్ద ఎందుకు డబ్బు తీసుకున్నావని నిలదీసి, ఆమె ఫోన్ నుండి గూగుల్ యాప్ తీసిఎశాడు. గురువారం సురేష్ డ్యూటీకి వెళ్లటంతో వారి ఇంట్లో పైన అద్దెకు ఉండే అతనితో ఫోన్‌లో గూగుల్ పే యాప్ శైలజ డౌన్‌లోడ్ చేయించుకుంది. ఈ విషయం తెలిసి సురేష్ మళ్లీ గూగుల్‌పే యాప్ ఎందుకు వేసుకున్నావని ఫోన్ చేసి అడగటంతో ఆమె ఆవేశంతో సమాధానం చెప్పింది. సురేష్ ఇంటికి వచ్చేసరికి భార్య శైలజ బంగారం, డబ్బులు, బట్టలు తీసుకుని చైతన్యపురి వెళ్తున్నానని పిల్లలకు చెప్పి వెళ్లిపోయింది. సురేష్ భార్య కోసం బంధువులను, స్నేహితులను, తెలిసిన ప్రాంతాలలో వెతికినప్పటికీ ఆమె ఆచూకీ తెలియకపోవటంతో శుక్రవారం గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

### టీస్టాల్‌లో మంచినీళ్ల విషయంలో వివాదం
**వ్యక్తిపై దాడి - తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి**

**గచ్చిబౌలి, జూలై 5 ప్రభాతవార్త**
ఓ టీస్టాల్‌లో మంచినీళ్ల విషయంలో చోటుచేసుకున్న స్వల్ప వివాదం ఘర్షణకు దారి తీసింది. టీ తాగేందుకు వచ్చిన వ్యక్తి మీద టీస్టాల్ నిర్వాహకుడు మరో ఇద్దరితో కలిసి దాడి చేయగా, వ్యక్తి తీవ్ర గాయాలతో మృతిచెందాడు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... మెదక్ జిల్లా టేక్‌మాల్ మండలానికి చెందిన సాయిలు(35) బ్రతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి బీరంగూడలో నివాసం ఉంటూ స్థానికంగా ఇసుక లారీల్లో ఇసుక అన్‌లోడ్ చేసే కూలి పనులకు వెళ్తుంటాడు. సాయిలు తన భార్య మీనా, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇసుక అన్‌లోడ్ కోసం వెల్లిన సాయిలు తెల్లవారు జామున 4.30 గంటల పరిధిలో మియాపూర్‌లో సంతోష్ దాబా పక్కన ఉన్న ఓ టీస్టాల్ వద్ద టీ తాగేందుకు వెళ్లాడు. టీస్టాల్ వద్ద మంచినీళ్ల విషయంలో సాయిలుకు, టీస్టాల్ నిర్వాహకుడు సతీష్‌కు వివాదం ఏర్పడింది. నీళ్ల విషయంలో ఏర్పడిన స్వల్ప వివాదం ఇద్దరి మధ్య ఘర్షణకు దారితీయగా, సతీష్ మరో ఇద్దరితో కలిసి సాయిలు మీద విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో సాయిలుకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌కు ఫోన్ చేసి స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సాయిలును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ద్రువీకరించారు. దీంతో సాయిలు కుటుంబ సభ్యులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు ఆసుపత్రికి చేరుకొని సాయిలు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## రికాబ్‌గంజ్‌లో అన్నదానం

**చార్మినార్,జూలై 5 ప్రభాతవార్త :**
అమావాస్య సందర్బంగా పాతబస్తీ రికాబ్‌గంజ్‌లో శుక్రవారం కుంభమేళ అగ్రవాల్ బంధు అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో కుంభమేళ అగ్రవాల్ బంధు అధ్యక్షులు పంకజ్ కుమార్ అగర్వాల్,శ్రీనివాస్, రాజ్‌కమల్ భట్టడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక అదృశ్యం

**ముషీరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:**
మైనర్ బాలిక ఇంటి నుండి చెప్పకుండా వెళ్లిపోయిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం కవాడిగూడ డివిజన్‌లోని మోతీలాల్ నెహ్రూనగర్‌లో నివసించే అకేల్ కామత్, ప్రమీల దేవిలకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. మూడవ కుమార్తె కే.సుమంజలి పదవ తరగతి ఫెయిల్ కావటంతో ఇంట్లోనే ఉంటోంది. ఈనెల మూడవ తారీఖు కామత్, ప్రమీల వారి వారి పనుల మీద బయటకు వెళ్లగా సుమంజలి ఇంటి నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్లి పోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి తండ్రులకు సుమంజలి కనిపించకపోవటంతో తెలిసిన ప్రాంతాలలో ఆమె కోసం విచారించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవటంతో శుక్రవారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల తమ కుమార్తె సుమంజలి ఫోన్‌లో బీహార్‌కు చెందిన అమర్ అనే వ్యక్తితో ఎక్కువగా మాట్లాడుతోందని, బహుశా సుమంజలి కనిపించకుండా పోవటానికి అమర్ కారణం కావచ్చునని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని ఎస్ఐ తెలిపారు.

## కూలీని కాపాడిన కానిస్టేబుళ్ళు

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** బహిర్భూమికి వెళ్లిన ఓ కూలి ప్రమాదవశాత్తు నాలాలో పడిపోవడంతో ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్ళు అతడి ప్రాణాలను కాపాడారు. ఈ సంఘటన కాచిగూడా పిఎస్ పరిధిలోని శ్యామ్‌నగర్ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, అంబర్‌పేట చెన్నారెడ్డి నగర్‌లో నివాసముంటున్న సయ్యద్ సాధిక్(50) కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం కూలిపని కోసం చాదర్‌ఘాట్ ప్రాంతంలో శ్యామ్‌నగర్ బహిర్భూమికి వెళ్ళాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలు జారి నాలాలో పడిపోయాడు. ఇది గమనించిన సమీప బస్తీ వాసులు కేకలు వేయగా, స్థానికంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు కాచిగూడ కానిస్టేబుళ్ళయిన ప్రదీప్, సిద్దయ్యలు పరుగున వచ్చి బురదనీట్లోకి దిగి సయ్యద్ సాధిక్‌ను కాపాడారు. అనంతరం అతడిని చెన్నారెడ్డినగర్‌లోని నివాసానికి తీస్కెళ్ళి అతని కుమారుడికి అప్పగించారు. అతనిని ప్రమాదం నుంచి కాపాడినందుకు ఇద్దరు కానిస్టేబుళ్ళనీ కాచిగూడా ఏసీపీ రఘు, ఎస్ఐ నరేష్‌కుమార్, ఎస్ఐ కె.సుభాష్‌లు అభినందించారు.



## బదిలీపై వెళ్లిన పోలీస్ సిబ్బందికి ఘన సత్కారం

**తలకొండపల్లి, జూలై 5,(ప్రభాతవార్త :** తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో గత ఆరు సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లను ఘనంగా సన్మానించిన ఎస్సై ఏ శ్రీకాంత్ బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ బాలస్వామి ప్రభాకర్‌లను శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ ఎతో ఉత్తమంగా అందరితో కలివిడిగా ఉంటూ విధులు నిర్వహించారని అన్నారు. బదిలీపై వెళ్లిన మా మదిలో ఎప్పటికీ ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి తమ వంతు కృషి

### ఎంపిపి పోతురాజు జంగయ్య



ఎంపీటీసీ, జడ్పీటీసీలను సన్మానిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది

**కొందుర్గు, జూలై 5, (ప్రభాతవార్త) :** మండల పరిషత్ అభివృద్ధికి తమ వంతుగా ఎంతో కృసి చేశామని మండల పరిషత్ అధ్యక్షులు పోతురాజు జంగయ్య అన్నారు. శుక్రవారం నాడు స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో ఎంపీఓ లాలాయ్య ఆధ్వర్యంలో మండల పరిషత్ సభ్యులకు సన్మానం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గత 5 సంవత్సరాలుగా తన విధులకు సహకరించిన సహ ఎంపీటీసీలకు, మండల స్థాయి అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### అభివృద్ధే ధ్యేయంగా పనిచేశా : వైస్ ఎంపీపీ

మండలానికి గత 5 సంవత్సరాలుగా అన్ని రంగాలల్లో అభివృద్ధి చేసేందుకు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో ఎంతో కృషి చేశానని వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ అన్నారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ రిటైర్డ్ ఎమ్మార్వో ఆంజనేయులుకు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొగిలిగిద్దలో ఎంపీటీసీకి ఘన వీడ్కోలు



ఎంపీటీసీ శ్రీశైలంకు ఘన వీడ్కోలు తెలుపుతున్న పంచాయతీ అధికారులు, తదితరులు

**షాద్‌నగర్, జూలై 5, (ప్రభాతవార్త) :** ఇటీవలే పదవీ కాలం పూర్తి చేసుకున్న మొగిలిగిద్ద – ఎలికట్ట ఎంపీటీసీ శ్రీశైలంకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తాజా మాజీ ఎంపీటీసీ శ్రీశైలం మాట్లాడుతూ... ఎంపీటీసీగా 5 సంవత్సరాల పాటు ప్రజాభివృద్ధికి కృషి చేశానని, అందుకు సహకరించిన సహ ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది సహకారంతో, సర్పంచు, వార్డు సభ్యులతో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నివారణకు చర్యలు తీసుకోవాలి



మేడ్చల్ సీఐ సత్యనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**మేడ్చల్, జూలై 5, ప్రభాతవార్త :** గంజాయి నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతూ మేడ్చల్ సీఐ సత్యనారాయణకు బిజెపి నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. మేడ్చల్ పట్టణ పరిధిలో యువత గంజాయి, మద్యానికి బానిసలై దురలవాట్లకు లోనౌతున్నారని, పట్టణంలో గంజాయి సిగరేట్ల విక్రయాలు జరుగుతున్నాయని వినతిలో పేర్కొన్నారు. ఇటీవల మేడ్చల్‌లో గంజాయికి బానిసలైన ముగ్గురు యువకులు మృతి చెందడం విచారకరణమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువకులు మత్తుకు, గంజాయికి బానిసలు కావడంతో వారి కుటుంబాలు అతలాకుతలమౌతున్నాయని, గంజాయి నివారణకు ప్రత్యేక నిఘా కమిటినీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.బిజెపి నాయకులు సుధాకర్‌రెడ్డి, ప్రేమ్ దాస్, ఈశ్వర్, మహేష్, నరేందర్, వంశీ, శ్రీశైలం యాదవ్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

**మొయినాబాద్, జూలై 5, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్ రెవెన్యూలో ఉన్నటువంటి శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్ ముందు రావూఫ్ ఇంటర్నేషనల్ స్కూల్ యొక్క డ్రైవర్ అతివేగం అజాగ్రత్తతో బస్సు నడుపుతుండగా ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడం జరిగింది. దీంతో మహిళకు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన మొయి నాబాద్ మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందినటు వంటి రోజువారి కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నటువంటి ఫిర్యాదుదారుడైన కుడవత్ బోడుక తండ్రి సోక్లా మరియు తన భార్య మున్ని ఇద్దరు కలిసి తన యొక్క వాహనమైన టివిఎస్ ఎక్సెల్‌పై నాగిరెడ్డి గూడకు వెళ్తుండగా మార్గమ ధ్యలో శ్రీనిధి స్కూల్ దగ్గరకు రాగానే బండ్లగూడ పరిధిలోని రావూఫ్ ఇంటర్నేషనల్ స్కూల్ చెందిన బస్సు డ్రైవర్ బస్సును అతివేగంగా నడుపుతూ ఫిర్యాదు దారు ప్రయాణిస్తున్న టివిఎస్ ఎక్సెల్‌ను ఢీకొ ట్టాడు. దీంతో ఫిర్యాదు దారుడు మరియు తన భార్య రోడ్డుపై పడిపో యారు. స్కూల్ బస్సు యొక్క ముందు టైరు తన భార్య ఎడమ చెయ్యిపై నుంచి వెళ్లింది. దానితో ఆమె యొక్క ఎడమచేతి విరిగిపోయింది.ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దరా ్యప్తు చేస్తున్నాము.

# వరుస దొంగతనాలతో భయందోళనలో ప్రజలు



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

## ఏర్పుమళ్ళ గ్రామంలో డబ్బు.. నగలు దొంగతనం

### తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనం

**బొంరాస్‌పేట్,జులై5,ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం ఏర్పుమళ్ళ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తాళాలు వేసి ఉన్న 6 ఇండ్ల తాళాలను పగులగొట్టి భారీగా డబ్బు,నగలను దొంగిలించారు.శుక్రవారం ఉదయం చోరీ జరిగిన ఇండ్లను పోలీస్‌లు పరిశీలించి వివరాలను సేకరించారు. వార్ల రమేష్ హైదరాబాద్‌లో ఉన్న తన మామ ఇంటికి వెళ్ళగా నూతన ఇంటి నిర్మాణం కోసం ఇంట్లో దాచిన 4లక్షల రూపాయాలు,10తులాల బంగారం,గోనేలి నర్సమ్మ ఇంట్లో బియ్యం డబ్బలో దాచుకున్న 2.5తులాల బంగారం,50వేల రూపాయాలు,తిరుపతి దర్శనంకు వెళ్ళిన బుడగజంగం మాసప్ప ఇంట్లో 11వేల రూపాయాలు,తుంకిమెట్ల గ్రామంలో ఉంటున్న తుర్క బువమ్మ ఇంట్లో దేవుడి గల్లలో ఉన్న 60వేలతోపాటు బీరువాలో ఉన్న30వేల రూపాయాలు,హైదరాబాద్ వెళ్ళిన నట్టలి వెంకటమ్మ ఇంట్లో బంగారు గొలుసుతోపాటు ఇతర వస్తువులు,బాపల్లి హన్మంతు ఇంట్లో 2తులాల బంగారంను దొంగిలించినట్లు స్థానికులు తెలిపారు.మండల వ్యాప్తంగా నాగిరెడ్డిపల్లి, దేవులానాయక్‌తా ండ,చౌదర్‌పల్లి, నాందార్‌పూర్, మేడిచెట్టు తాండ, బొంరాస్‌పేట్ మండల కేంద్రంతోపాటు పలుగ్రామాలలో గత ఎండకాలం నుండి వరుసగా ప్రతి 15 నుండి నెల రోజులలో ఒక దొంగతనం జరుగుతునే ఉన్నాయి.కానీ ఇప్పటి వరకు ఒక్కరు కూడా దొరలేదు. ఇప్పటికైై పోలీస్‌లు ఇలాంటి దొంగతనాలు జరగకుండా గ్రామాల్లో గట్టినిఘను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



యాచారం మండల పరిషత్ కార్యాలయం

## ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల అభివృద్ధి శూన్యం

**యాచారం జూలై5,ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాలలో ప్రజాప్రతినిధులు ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వారు లేక అభివృద్ధి కుంటుపడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సర్పంచ్‌ల పదవి కాలం ముగిసి నెలలు గడుస్తుననన సర్పంచ్‌ల ఎన్నికలు జరగకపోవడం గ్రామీణ ప్రాంతాలన్ని అభివృద్ధికి అమ డ దూంలో ఉంటున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రత్యేక అధికారుల పాల నలో అధికారులు తమ విధులు నిర్వహించడంలో నిమగ్నం అయిపోవడంతో అదనపు భాద్యతలు భారంగా మారాయని గ్రామపంచాయతీల ప్రత్యేక అధికా రులుగా పనిచేయలేకపోతున్నారని తెలుస్తుంది.ఆయా గ్రామాల ప్రత్యేక అధికా రులు ఏనాడు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని తమ విధి నిర్వహణలో ఆయా శాఖల పనులే అధికంగా ఉండడం వలన అదనపు బాధ్యతలు చేపట్టలేక పోతున్నా మని పలువురు వాపోతున్నారని తెలుస్తుంది.ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు ఏనాడు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని తమ విధి నిర్వ హణలో ఆయా శాఖల పనులే అధికంగా ఉండడం వలన అదనపు బాధ్యతలు చేపట్టలేకపోతున్నామని పలువురు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులుగా సర్పం చ్‌లు, ఎంపిటిసిలు వార్డు సభ్యులు,జడ్పిటిసిలు,వారి వారి పరిధిలో ఉనన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తారని ప్రత్యేక అధికారులు వాటిని సమర్ధవంతంగా పూర్తి చేయలేకపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నా యి. తక్షణమే గ్రామ పంచాయతీకి సంబంధించిన ఎన్నికలు జరగాలని ప్రత్యేక అధికార పాలనకు స్వసినత చెప్పాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.పేరుకు మాత్రమే ప్రత్యేక అధికారులు విధి నిర్వహణలో అధికంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారని వారిపై సూపర్‌వైజర్ తగ్గి అధికంగా విధులు దుర్వినియోగం జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీ కార్యదర్శులు ఆడింది.ఆట పాడిందే పాట అన్న చందన ఉందని వారికి ఎవరి పర్యవేక్షణ లేకపోవడంతో విచ్చలవిడిగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు.ప్రభుత్వం ఎంతో శ్రద్ధతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన వాటాని కార్యదర్శులు సక్రమంగా నిలబట్టిం చడంలో విఫలమయ్యారని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యదర్శులు వారి బాధ్యతలు నిర్వర్తించడంలో విధులను అమలు చేయడంలో పూర్తి విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు.గ్రామపంచాయతీలలో నిధులు లేక కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు.

## గొర్రెలు అపహరణ : కేసు నమోదు

**ఆదిభట్ల జూలై 5,ప్రభాతవార్త :** గుర్తుతెలియని దుండగులు ఆరు గోర్రెలు ఎత్తు కెళ్లిన ఘటన ఆదిభట్ల పోలిసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఆదిభట్ల ఎస్సై వెంకటేష్ వివరాల ప్రకారం...కొంగకలాన్ గ్రామంలో దండిగా పాండు తన వద్ద ఉన్న గొర్రెల మందను సాకుతూ జీవనం సాగిస్తున్నాడు.దాదాపు 100 గొర్రెలు ఉన్న పాండు వాటి కోసం షెడ్డు వేసి రోజు జాగ్రత్తగా చూసు కునేవాడు రోజు లాగే సాయంత్రం షెడ్డులో గొర్రెలను ఉంచి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూసేసరికి ఆరు గొర్రెలు కనిపించడకపోవడంతో ఎవరు దొంగలించారని అనుమానంతో ఆదిభట్ల పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలిసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సమస్య ఉందని అడిగి వెంటనే స్పందించిన సెక్రటరీ

**యాచారం జూలై5,ప్రభాతవార్త :** గ్రామాలకు వెళ్లే రోడ్డు ఇరువైపులా ముల్లపొదలు చెట్లు ఉన్నాయని అడిగి వెంటనే యాచారం సెక్రటరీ తిరుపతయ్య స్పందించారని బిజెపి యాచారం మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ హర్షం వ్యక్తం చేశారు.యాచారం గ్రామపంచాయతీ గండ్లగూడ నుండి మల్కిజగూడ వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న పొదలు చెట్ల వల్ల సరికొండ,నానక్ నగర్, మేడిపల్లి,మల్కిజ్ గూడ గ్రామాలకు చెందిన ప్రయాణికులు వచ్చేటప్పుడు పోయేటప్పుడు ఇబ్బంది పడుతున్న విషయం నా దృష్టికి రాగానే వెంటనే యాచారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. వెంటనే స్పందించిన యాచారం గ్రామపంచాయతీ కార్యదర్శి పొదల చెట్లను కొట్టిస్తునందుకు బిజెపి పార్టీ యాచారం శాఖ తరపున వారికి ప్రత్యేకమైన దన్యవాదములు తెలిపారు.అధికారులు సమస్యలను తెలుపగానే స్పందించడం అరుదుగా ఉందని తీరుపతయ్యకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయనను ఆదర్శంగా తీసుకొని మిగతా కార్యదర్శులు నడుచుకోవాలని కోరారు.

## నీట్ అవకతవకలపై విద్యామంత్రిని తొలగించాలి

**ఘట్‌కేసర్, జూలై 5, ప్రభాతవార్త:** నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై కేంద్ర విద్యాశాఖ మంత్రిని పదవీ నుంచి భర్తరఫ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నీట్, నెట్ పరీక్షా పత్రాల లీకేజీకి నిరసనగా విద్యార్థి సంఘాలు నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయ్యిందని తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ నాయకులు ప్రభుత్వ పాఠశాలల వద్ద ఆందోళన నిర్వహించి తెరచి ఉన్న సర్కార్ పాఠశాలలను బంద్ చేయించారని పేర్కొన్నారు. నీట్, నెట్ పరీక్షల అవకతవకలతో విద్యార్థులకు నష్టం జరిగిందని దోషులను శిక్షించి తగిన న్యాయం చేయలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి దేవేంద్ర ప్రధాన్‌ని మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఏను రద్దు చేయాలని, కేంద్ర పరీక్షల నిర్వహణ భాధ్యత రాష్ట్రాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి నానావత్ శివాజీనాయక్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి వీరబోయిన మహేశ్‌యాదవ్, నాయకులు మనోజ్, శ్రీను, శ్రీకాంత్, కార్తీక్, వినోద్‌నాయక్, చింటూ, అనిల్, ఎప్రాయిమ్, దేవేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

### సీఐ భూపాల్ శ్రీధర్

**చేవెళ్ల, జూలై 5 ప్రభాతవార్త :** సైబర్ నేరాల పట్ల ప్రజలు,యువత అవగాహన కలిగి ఉండాలని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం రాత్రి చేవెళ్ల మండల పరిధిలోని దామరగిద్ద గ్రామంలో సైబర్ నేరాలపై యువత, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజలు వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాల అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్లలో ఓటీపి, ఓఎల్‌ఎక్స్, పేటిఎం, గూగుల్ పే, ఫోన్ పే, కెవైసీలను ఆప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని చెప్పారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ

## తెల్లారిన వీడని మైకం..

### తాగిన మైకంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి ప్రమాదం

**కొత్తూర్, జూలై 5, ప్రభాతవార్త :** కొత్తూర్ మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామానికి చెందిన గోపాల్ అనే యువకుడు శుక్రవారం ఉదయం 7గంటలకే మద్యం సేవించి కొత్తూర్ మున్సిపాలిటీలోని గతంలో ఉన్న కల్లు కాంపౌండ్ ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. అక్కడికి సమయానికి చేరుకున్న మున్సిపల్ సిబ్బందులు, మున్సిపల్ సూపర్‌వైజర్ రఘు వెంటనే స్పందించి 108 వాహనాన్ని పిలిచి ప్రమాదానికి గురైన సిద్దాపూర్ గ్రామానికి చెందిన గోపాల్‌ను ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమయానికి స్పందించి మానవత్వం చాటుకుని ఒక నిండు ప్రాణం కాపాడిన మున్సిపాలిటీ సిబ్బందులకు అక్కడున్న ప్రజలు చేతులెత్తి ధన్యవాదాలు తెలియజేశారు.

### ఘట్‌కేసర్ మండల ప్రత్యేకాధికారిగా సాంబశివరావు

**ఘట్‌కేసర్, జూలై 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండల ప్రత్యేకాధికారిగా ఎం.సాంబశివరావు బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ అధ్యక్షుని పదవీకాలం ఈనెల 4తో ముగియడంతో ప్రభుత్వం మండలానికి జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించింది. ఈమేరకు మేడ్చల్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.సాంబశివరావు (డిఆర్‌డిఓ) ఘట్‌కేసర్ మండల ప్రత్యేకాధికారిగా వచ్చి బాధ్యతలు సీ ్వకరించారు. ఎంపిపి సుదర్శన్‌రెడ్డి పదవీకాలం గురువారంతో పూర్తి కావడంతో ప్రత్యేకాధికారికి మండల బాధ్యతలు అప్పగించారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో డిఆర్‌డిఓ సాంబశివరావు బాధ్యతలు చేపట్టి ఎంపిడిఓ గీతారెడ్డి, సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్ష జరిపారు.

## ఇద్దరు బాలకార్మికులకు విముక్తి : కేసునమోదు



బాలకార్మికులను పని నుంచి విముక్తి కల్పిస్తున్న అధికారులు

**ఘట్‌కేసర్, జూలై 5, ప్రభాతవార్త:** ఇద్దరు బాలకార్మికులను పని నుంచి విముక్తి కల్పించగా యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలో అధికారులు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించి పలు వ్యాపార కేంద్రాల్లో తనిఖీలు చేశారు. ఎన్‌జిఓ నిట్ట పద్మ, ఆపరేషన్ ముస్కాన్ టీం ఇంచార్జ్ ఎస్ఐ కొండల్‌లు పలు దుకాణాలపై దాడులు చేశారు. ఘట్‌కేసర్‌లోని ఎస్ఆర్ఎం మెకానిక్ ఎంటర్‌ప్రైజెస్ షాపులో మైనర్ బాలుడు షేక్ మొహమ్మ ద్‌ఖాసీం (14) కొంతకాలంగా పనిచేస్తుండగా విచారించి వివరాలు సేకరించారు. ఘట్‌కేసర్ ద్వారకానగర్ కాలనీకి చెందిన దుకాణం యాజమాని షేక్ ఆసిఫ్ మైనర్ బాలుడి చేత మెకానిక్ పని చేయిస్తున్నందున మిట్ట పద్మ, అశ్విత ఫిర్యాదు చేయగా బాలకార్మిక నిర్మూలన చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడ ఏవన్‌యూపీవీసీ విండోస్ షాపులో ఓమైనర్ బాలుడు మహమ్మద్ ఆరిఫ్ (13) హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యులు నిట్ట పద్మ, ఎస్ఐ కొండల్‌లు విచారించి వివరాలు సేకరించారు. గత కొంతకాలంగా బాలుడి ఆరిఫ్ చేత దుకాణం యాజమాని మహమ్మద్ గురు పనిచేయిస్తున్నాడని తెలిపారు. దీంతో యాజమాని మహమ్మద్ గురుపై బాలకార్మిక చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ సైదులు తెలిపారు. ఎక్కడైనా మైనర్లను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని సీఐ స్పష్టం చేశారు.

## మండల సిబ్బందికి సన్మానం..ఎంపిపికి వీడ్కోలు



సిబ్బందిని సన్మానించి బహుమతి అందజేస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జూలై 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అధికారులు, సిబ్బందిని సన్మానించారు. ఎంపిపి పదవీకాలం గురువారంతో ముగియడంతో ఆయన కార్యాలయ సిబ్బందిని శాలువాలతో సన్మానించి దుస్తులను బహుమతిగా అందజేశారు. ఐదు సంవత్సరాల పాటు సిబ్బంది తనకు సహకరించి తమ వంతు సేవలు అందించారని ఎంపిపి పేర్కొన్నారు. పదవీ కాలం పూర్తి కావడంతో ఎంపిపి బయటకు వెళ్లిపోతుండగా సిబ్బంది భావోద్వేగంతో మాట్లాడుతూ కంటతడి పెట్టుకొని వీడ్కోలు పలికారు. ఐదు సంవత్సరాల పాటు కార్యాలయంలో కలిసి పని చేసిన వెళ్లిపోతుండటంతో సిబ్బంది, ఎంపిపికి కృతజ్ఞతలు తెలిపి సాగనంపారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ ఎల్.గీతారెడ్డి, ఏఈ పల్లా వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చిలుగూరి కుమార్, సిబ్బంది మహమ్మద్ షరీఫ్, రాములమ్మ, గోరకంటి కుమార్, లక్ష్మి, ఉమ, సత్యవతి, మధు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏయూలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోబోటిక్స్

**ఘట్‌కేసర్, జూలై 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 80 మంది విద్యార్థులతో 'ది ఫ్యూచర్ ఈజ్ కనెక్టెడ్' నిర్వహించారు. ఐఓటి ఎన్‌హాన్స్డ్ బై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్ జరిపారు. ఏఐ విభాగాధిపతి డాక్టర్ ఎ.మల్లికార్జున్‌రెడ్డి సందేశాత్మక మాటలతో కార్యక్రమం ప్రారంభించారు. ఐఓటి పరిచయం, ప్రస్తుత నిజజీవిత ఉదాహరణలు, దాని చరిత్ర యుఏవిసిఏఎన్, బిఎల్ఈ జిగ్బీ వైఫై స్పెక్ట్రమ్, ఎఎన్‌టి, ఓసిపిపి, హెచ్‌డి–పిఎల్‌సీ వంటి పలు ప్రోటోకాల్‌పై వివరించారు. కాగ్నిటివ్ రేడియోలు, స్మార్ట్ పార్కింగ్, మెషిన్ లెర్నిం గ్, రోబోటిక్స్ రంగాలలో కొత్త సాంకేతిక సంఘటనలు సెషన్‌లో స్పీకర్ పాల్గొనేవారు మధ్య గొప్ప పరస్పర చర్య జరిగింది.



## వారం రోజుల్లో బిటిరోడ్డు నిర్మిస్తాం

### పంచాయతీరాజ్ ఏఈ భూపాల్

**కేశంపేట, జూలై 5, ప్రభాతవార్త** మండల కేంద్రంలోని వైయస్సార్ (కాకునూరు) చౌరస్తాలో గుంతలమయంగా మారిన బిటి రోడ్డు, రీబిటి నిర్మాణం కోసం శుక్రవారం పంచాయతీ రాజ్ ఏఈ భూపాల్ ప్రసూన్ కన్స్ట్రక్షన్స్ ప్రోప్రైటర్ కాంట్రాక్టర్‌గోపాల్ రెడ్డిలు రోడ్డును పరిశీలించారు. వారం రోజులలోపు రీబిటి నిర్మిస్తామనివారు తెలిపారు. కార్యక్రమంలో కేశంపేట మాజీ సర్పంచ్ ఎన్నం శ్రీధర్ రెడ్డి యుగంధర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్లాస్ ఖాన్‌పేటలో తాత్కాలిక ఆధార్ సేవలు

**కేశంపేట, జూలై 5, ప్రభాతవార్త** కేశంపేట మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో తాత్కాలిక ఆధార్ సేవలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థా నిక ప్రభుత్వ పాఠశాలలో ఆధార్ సేవలు అందిస్తున్నారు. ఆధార్‌లో పేరు మార్పు ఫోటో అప్డేషన్ ఆధార్‌లోని పొరపాట్లను సరిచేసుకోవడానికి అవకాశం ఉన్నట్లు నిర్వాహకులు విజయ్ తెలిపారు. పరిసరాల గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వి నియోగించుకోవాలని అన్నారు.

## నిరుద్యోగుల కలలను కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### బిజెవైఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కణం ఉదయ్‌కుమార్‌గౌడ్

**కేశంపేట, జూలై 5, ప్రభాతవార్త** గత బిఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు వేయకుండా నిరుద్యోగయువతను మోసం చేస్తే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వారి కలలను కాలరాస్తున్నాయని కణం ఉదయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. అర్ధరాత్రి నుంచే అక్రమ అరెస్టులతో నిరుద్యోగ యువత పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న బిజెవైఎం నాయకులను అడ్డుకుంటున్నారని అరస్టులతో ఉద్యమాలు ఆపలేరని ఇప్పటికైన నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చకుంటే బిజెవైఎం యువత ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిరసనలు ఇంకా ముమ్మరమవుతాయని ఆయన అన్నారు.

## మేము మీతోపాటే ...

### మాజీ మంత్రి సబితా రెడ్డిని కలిసిన మండల నాయకులు



**నవాబుపేట, జూలై 5, ప్రభాతవార్త** బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ నాయకత్వంలో పార్టీ తెలంగాణలో పటిష్టంగా ఉందని బిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతామని బిఆర్ఎస్ మండల నాయకులు శుక్రవారం మాజీ మంత్రి సబితారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కందాడ నాగిరెడ్డి పీఏసిఎస్ చైర్మన్ పోలీస్ రాంరెడ్డి తదితరులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీని కార్యకర్తలు గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్నారని అధైర్యపడకుండా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. మండలంలో బిఆర్ఎస్ పార్టీ నవాబుపేట మండలంలో బలంగా ఉన్నదని ఎమ్మెల్యే కాలే యాదయ్య సొంత మండలమైనప్పటికి ఎమ్మెల్యే స్వగ్రామం చించల్‌పేటలో కార్యకర్తలు పార్టీ మారలేదని వారు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు కందాడ నాగిరెడ్డి సారధ్యంలో సీనియర్ నాయ కుడు పిఏసిఎస్ చైర్మన్ పోలీస్ రామిరెడ్డిల నాయకత్వంలో కొనసాగుతామని అన్నారు. సబితారెడ్డితో మండల పార్టీ సమస్యలను వివరిస్తూ రాబోయే రోజులలో బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని సబితారెడ్డితోపాటు యువనాయకుడు కార్తీక్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరుగ్యారంటీలను అమలుపరిచే విధంగా ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు నాగిరెడ్డి పిఏసిఎస్‌చైర్మన్ పోలీసుల రాంరెడ్డి ఎంపిటిసి ఫోరం అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి ఎంపిటిసి విజయ్ కుమార్ పురుషోత్తం పార్టీ సీనియర్ నాయకులు భరత్‌రెడ్డి నా ్యలం ప్రకాశం యువనాయకులు అడ్వకేట్ పోలీసు మహేశ్వర్‌రెడ్డి శాంత్‌కుమార్ అప్సర్‌ఖాన్ శ్రీకాంత్‌గౌడ్ నరసింహారెడ్డి రఘు పతిరెడ్డి శ్రీకాంత్ ధర్మయ్య జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

### జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దశరథ్‌నాయక్



జడ్పీటిసి దశరథ్ నాయక్‌ను సన్మానిస్తున్న యువజన సంఘం నాయకులు

**కడ్తాల్,జులై 05 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జడ్పీటిసి నివాసంలో జడ్పీటిసి పదవికాలం ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బిఆర్ఎస్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐదు సంవత్సరాల కాలంలో పేదలకు ఎనలేని సేవలు చేశారు. రాబోయే కాలంలో ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని అదేవిధంగా తాను చేసిన సేవలను ప్రజలు మరిచిపోలేరని యువజన సంఘం నాయకులు అన్నారు. అనంతరం జడ్పీటిసి దశరథ్‌నాయక్ మాట్లాడుతూ యువకులు తలచుకుంటే సాధ్యం కానిది ఈలోకంలో లేదని తెలిపారు. యువకుల బలంతోనే రాష్ట్ర రాజకీయాలలో కీలక నాయకులు అనేక స్థాయిలలో ఉన్నారని తెలిపారు. చదువుకున్నవారు, యువకులు రాజకీయాలలో ఉంటే దేశాన్ని గాని రాష్ట్రాన్ని గాని మన గ్రామాలు గాని వారి ఆలోచనలతో మరింత అభివృద్ధి చేసుకునే విధంగా కార్యక్రమాలు చేపట్టవచ్చని యువకులకు సందేశమిచ్చారు. మీ ప్రోత్సాహ నాకు ఎల్లప్పుడూ ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో పిఏసిఎస్ ఛైర్మన్ వెంకటేష్, మాజీ ఎంపిపి సువాలి పంతు, మాజీ ఎంపిటిసి ప్రియారమేష్, మాజీ సర్పంచ్ శంకర్, బిఆర్ఎస్ యూత్ టౌన్ ప్రెసిడెంట్ కొప్పు కృష్ణ, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చేగూరి మహేష్, యూత్ అధ్యక్షులు కంబాలపల్లి అంజి,మహేష్, ముస్లి మహేష్, పాండు, రాజుగౌడ్, జెడిఎన్ వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్, హరి, రమేష్, దాస్య గోపాల్, వెంకటేష్, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కుకుట్ల శ్రీను, శ్రీకాంత్, ఉపేందర్, ఒగ్గు రమేష్, శ్రీను, జాన్యదేవ్, సురేష్, రాజశేఖర్, సాయి, మహేష్, కరుణాకర్, కిరణ్, మురళి,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రైబల్ వెల్ఫేర్‌లో మున్సిపల్ కమిషనర్ తనిఖీ

**కొడంగల్,జూలై 5ప్రభాతవార్త** కొడంగల్ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్ తనికీలు నిర్వహించారు.శుక్రవారం మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్‌తో కలిసి పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్దులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.ఉదయం వేళ విద్యార్దులకు అందిస్తున్న ఇడ్లీలు,బియ్యం,వంటనూనే నాసిరకంగా ఉన్నాయని తెలిపారు.పాఠశాలలో 600 మంది విద్యార్దులు ఉన్నా వంట ఏజెన్సీ లేకపోవడంపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు.కాగా వంట ఏజెన్సీకి బదులు బయట వ్యక్తులతో వంట చేయిస్తున్నారని ప్రిన్సిపాల్‌పై మండిపడ్డారు.



గురుకుల పాఠశాలలో తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమీషనర్

## పేదప్రజలకు పట్టాలు క్రమబద్ధీకరించాలని వినతి

**ఘట్‌కేసర్, జూలై 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలోని ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకున్న పేదల స్థలాలను క్రమబద్ధీకరించాలని కాలనీవాసులు ఘట్‌కేసర్ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. 1996లో ప్రభుత్వం చౌదరిగూడ సర్వేనంబరు 869లో 183 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిందని ఆర్.సుశీల, కె.మంగమ్మ, బి.లక్ష్మి, ఎ.సుక్కమ్మలు తెలిపారు. పట్టాలు పొందిన లబ్దిదారులు వీకెర్‌సెక్షన్‌కాలనీ పేరుతో 80 శాతం గృహాలు నిర్మించుకున్నారని, గ్రామపంచాయతీకి ఇంటి పన్నులు చెల్లిస్తున్నారని తెలిపారు. సర్వేనంబర్ 869లో తమకు ప్రభుత్వం అసైనీ భూమి ఇచ్చిందని కటికల యాదయ్య రంగారెడ్డికోర్టులో అపీల్ చేశారని తెలిపారు. డబ్ల్యుపినెం: 27194/2021 వేసి తహశీల్దార్, పోలీసులు భూమి వద్దకు రాకుండా ఆర్డర్ తెచ్చుకున్నారని తెలిపారు. అపీల్ పెండింగ్‌లో ఉండగా ఆర్డర్ తీసుకున్న దానిపై ఘట్‌కేసర్ తహశీల్దార్ ఏలాంటి కేసు వేయలేదని తెలిపారు. పట్టాలు పొంది ఇండ్లు నిర్మించుకున్న పేదల పక్షాన తహశీల్దార్ కేసు వేయాలని 183 మంది పేదలకు స్థలాలను రెర్యులరైజేన్ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సామర్థ్యం 50నుంచి 80ఎంవిఎకు పెంపు : విద్యుత్ డిఇ



లాల్‌గడిమలకపేట్‌లో 132/33కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సామర్థ్యం పెంపునకు 80ఎంవిఎ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సిద్ధంగ ఉన్న దృశ్యం

**శామీర్‌పేట, జూలై 5, ప్రభాతవార్త** లాల్‌గడిమలకపేట్‌లోని 132/33కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం 50ఎంవిఎ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం ఉన్నందున దాన్ని తీసివేసి ఎక్కువ 80ఎంవిఎ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు మేడ్చల్ విద్యుత్ డిఇ శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు సుమారు 6కోట్ల రూపాయలు ఉంటుందన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు 80ఎంవిఎ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. దీని వల్ల శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలోని జీనోమ్‌వ్యాలీ ఇండస్ట్రీరియల్ ఏరియా, శామీర్‌పేట మండలం, మూడుచింతలపల్లి మండలం మేడ్చల్ మండలంలోని ఉన్న గృహ,కమర్షియల్ ఇండస్ట్రీరియల్ విద్యుత్ వినియోగదారులకు 80ఎంవిఎ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ ఐదు రోజుల్లో విద్యుత్ సరఫరాకు కొన్ని సమయాల్లో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## బాధిత కుటుంబానికి 10వేల ఆర్థిక సహాయం



మజీద్‌పూర్ గ్రామంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ నాయకులు తుంకి రమేష్,పాల్గొన్న నాయకులు బిక్షపతి, తదితరులు

**శామీర్‌పేట, జూలై 5, ప్రభాతవార్త** మజీద్‌పూర్ గ్రామంలో అనారోగ్యంతో ఉండి మృతిచెందిన మమ్మద్ జానీ కుటుంబానికి 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసినట్లు మజీద్‌పూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు తుంకి రమేశ్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవటానికి తన వంతు సేవా భాగంగ ఆర్థిక సహాయంను అందజేసినట్లు తెలిపారు. శామీర్‌పేట మండలంలోని మజీద్‌పూర్ గ్రామంలోని బాధిత కుటుంబ సభ్యులకు వారి నివాసంకు వెళ్లి ఆర్థిక సహాయంను అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రతి ఒక్కరు కూడ ఆదుకోవటానికి ముందుకు రావాలన్నారు. నాయకులు తుంకి రమేశ్‌తో పాటు గ్రామ మాజీ ఉపసర్పంచు తుంకి బిక్షపతి, మాజీ వార్డుసభ్యురాలు కె.నర్మదా, ఎండి అహ్మద్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, పాల్గొన్నారు.

## ఇంట్లో మూడు సెల్‌ఫోన్లు మాయం..ఫిర్యాదు

**ఘట్‌కేసర్, జూలై 5, ప్రభాతవార్త:** ఇంట్లో మూడు సెల్‌పోన్లు మాయమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ బ్రూక్‌బాండ్‌కాలనీకి చెందిన రేణాదేవి (31) గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి తలుపులు మూసి ఇంట్లో నిద్రకు ఉపక్రమించింది. శుక్రవారం ఉదయం 6 గంటలకు లేచి చూడగా వివోవై200ఈ, వివోవై21, రెడ్మి 10 మొబైల్‌పోన్లు కనిపించలేదు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి 3 పోన్లు అపహరించుకుపోయారని రేణాదేవి ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ సైదులు తెలిపారు.

## నేడు శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీకి సిఎం రేవంత్‌రెడ్డి రాక

**శామీర్‌పేట, జూలై 5, ప్రభాతవార్త** శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో శనివారం సాయంత్రం జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విచ్చేస్తున్నట్లు నల్సార్ వైస్‌చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు పేర్కొన్నారు. భారత రాజ్యాంగం అందరికి అందుబాటులో ఉండాలనే ఆలోచనతో ఒక బేసిక్ కోర్సును నల్సార్ విశ్వవిద్యాలయం తెలుగులో మీ ముందుకు తెస్తుంది. భారత రాజ్యాంగం ఒక సామాజిక, రాజకీయ, న్యాయపత్రం ఇదీ సామాజిక విప్లవానికి నాంది కానున్నట్లు దీనిని నల్సార్ లా యూనివర్సిటీ నాలుగు నెలల పాటు తెలుగులో ఓ కోర్సును రాజ్యాంగంను అందుబాటులోకి తీసుకరావటానికి శనివారం ప్రారంభిస్తుందని అన్నారు. శనివారం సాయంత్రం 4గంటల నుంచి 5.30గంటల వరకు కార్యక్రమం కొనసాగనుంది. నల్సార్‌లో జరిగే ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ చాన్స్‌లర్ జస్టిస్ ఆలోక్ ఆరాధే, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎకె పట్నాయక్, సెక్రటరీ జనరల్ కాపిటల్ ఫౌండేషన్ సొసైటీ డాక్టర్ వినోద్ సేథి, పలువురు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగ సిఎం రేవంత్‌రెడ్డి నల్సార్‌కు రాక సందర్భంగ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తుంది.

### ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవం

బాదంపప్పు మంచితనంతో మీ చర్మానికి సంపూర్ణ పోషణ అందించండి చర్మఆరోగ్యాన్ని మంచిగా కాపాడుకోవడానికి బాహ్య సంరక్షణ కంటే ఎక్కువ కష్టపడాల్సి ఉంటుంది అదిలోపల నుంచి పోషణ కోరుకుంటుంది. మనం తీసుకునే ఆహారం మన చర్మం మరియు మొత్తం ఆరోగ్యంపై నేరుగా ప్రభావం చూపుతుంది. అందువల్ల బాదం వంటి పోషకమైన ఆహారాలను చేర్చడం ద్వారా స్వచ్ఛమైన మరియు సమతుల్య ఆహారాన్ని నిర్వహించడం చాలా ముఖ్యం. 15 ముఖ్యమైన పోషకాలను సమృద్ధిగా కలిగిన బాదం మన చర్మానికి ఎంతో మేలు చేస్తుంది.



కలెక్టర్‌రేట్‌లో నిరసనతెలుపుతున్న బీజేపీ నాయకులు



నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీస్‌లు



యాచారం పోలిసు స్టేషన్‌లో బిజెవైఎం నాయకులు



ముందస్తుగా అరెస్టు అయిన రమేష్ నాయక్

# బిజెపి, బిజెవైఎం నాయకుల ముందస్తు అరెస్టు దారుణం

**కొత్తూర్, జూలై 5, ప్రభాతవార్త :** తెలంగాణలో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని బీజేపీ యువమోర్చ నాయకులు నిరసన తెలిపారు. కొత్తూర్ మండలానికి చెందిన బీజేపీ యువమోర్చ నాయకులు బీజేవైఎం రాష్ట్ర పిలుపుమేరకు శుక్రవారం రాష్ట్ర యువ మోర్చా నాయకులు అమ్డాపురం రణదీర్‌గౌడ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి నిరసన కార్యక్రమం చేపట్టారు. అమ్డాపురం రణదీర్‌గౌడ్ మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్ర ఏర్పడక ముందు ఆనాడు యువత తెలంగాణ కోసం నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఉద్యమం చేపడితే తెలంగాణ వస్తే మా నీళ్లు మా నిధులు మా నియామకాలు మాకు వస్తాయి అన్న ఆశతో ఉద్యమంలో అమరులైనటువంటి విద్యార్థుల త్యాగ ఫలితాలతో తెలంగాణ తెచ్చుకోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాల కాల వ్యవది గడిచిపోయిన తెలంగాణలో నిరుద్యోగికి ఉద్యగ అవకాశాలు లేకుండా పోయింది.పది సంవత్సరాల కాలం పాటు ముఖ్యమంత్రిగా అనుభవించిన కేసీఆర్ నిరుద్యోగులకు మొండి చేయించాడు. మళ్లి నిరుద్యోగులు గలమెత్తి ఆ యొక్క నిరుద్యోగ సమస్యలపైన పోరాడి కేసీఆర్ ప్రభుత్వం గద్దె దిగితే వచ్చే ప్రభుత్వమైన ఆ ఆశలని నెరవేరుస్తాదని మళ్లి ఉద్యమిస్తే మళ్లి ఆ నిరుద్యోగుల ఉద్యమాన్ని ఊపిరి చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని తెలంగాణ డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఆశోక్, అసెంబ్లీ కన్వీనర్ పుట్నాల సాయి, కో కన్వీనర్ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి శివ, వెంకటేశ్,ప్రశాంత్, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

### బొంరాస్‌పేట్‌లో..

**బొంరాస్‌పేట్,జులై5,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర బిజేవైఎం శాఖ పిలుపుమేరకు ఈ నెల 5 శుక్రవారం నిరుద్యోగ సమస్యలపై జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉన్నందున బిజేవైఎం నాయకులు, కార్యకర్తలను పోలీస్‌లు ముందస్తుగా అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌లు అరెస్టు చేసిన వారిలో నవీన్,రాజు,హరిక్రిష్ణ తదితరులు ఉన్నారు.

### ముందస్తు అరెస్టులు దారుణం

**యాచారం జూలై5,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని గ్రీన్ పార్మాసిటిలో ముందస్తు అరెస్టులుగా బిజెపి నాయకులు శుక్రవారం అరెస్టు చేశారు.బిజెవైఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ సమస్యల గ్రూప్ 1,2 పోస్టులు పెంచాలి,డిఎస్సి నోటిఫికేషన్ వేసి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి పరీక్షలకు సమయం ఉండేలా కేటాయించాలని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ముంత జంగయ్య యాదవ్,బిజెవైఎం మండల కార్యదర్శి బన్నే శివమోదీ వెళుతున్నాడని సమాచారంతో హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటి మేడిపల్లి నక్కర్త పోలిస్ స్టేషన్ పోలిసులు తెల్లవారు జామున అక్రమంగా ఇంటికి వచ్చి అరెస్టు చేసి పోలిసు స్టేషన్‌కి తీసుకెళ్లారు.

### చౌడపూర్‌లో..

**చౌడపూర్ జూలై 5,ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీ నిరుద్యోగ జేఏసి శుక్రవారం టీజిపిఎస్సి ముట్టడికి పిలుపునిచ్చింది.ముట్టడి కార్యక్రమంలో పాల్గొనకుండా నిరుద్యోగ యువకులను పోలిసులు ముందస్తు అరెస్టు చేశారు.ఎన్ని అక్రమ కేసులు పెట్టిన నిరుద్యోగ జేఏసి వెనకబడుగు వేయదని,డిఎస్సి పరీక్షలు వాయిదా వేసి మోగా డిఎస్సీ ద్వారా 25 వేల పోస్టులు పెంచాలని గ్రూప్స్ ఉద్యోగాల భర్తీ చేయాలని రమేష్ నాయక్ డిమాండ్ చేశారు.

### ఘట్‌కేసర్‌లో..

**ఘట్‌కేసర్, జూలై 5, ప్రభాతవార్త:** నిరుద్యోగ సమస్యపై భారతీయ జనతా యువమోర్చ టిజీపీఎస్సీ, కలెక్టరేట్ల ముట్టడికి పిలుపు ఇవ్వడంతో పోలీసులు శుక్రవారం ఉదయం ముందస్తు అరెస్టులు చేశారు. ఘట్‌కేసర్ ఎస్ఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు యువమోర్చ, ఏబీవీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని నాయకులు కలెక్టరేట్ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అనిల్‌గౌడ్, జిల్లా కార్యదర్శి కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకం శ్యామ్‌కిరణ్, నాయకులు ఉదయ్‌కుమార్, సురేంద్రయాదవ్, పాశం వెంకట్‌రెడ్డి, శివకృష్ణలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వంద రోజుల్లో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేకుండా నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న నాయకులను అరెస్టులతో నిర్భంధించడం,



ఘట్‌కేసర్‌లో ముందస్తు అరెస్ట్ చేస్తున్న పోలీసులు

అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటని బిజెవైఎం అధ్యక్షులు విక్రాంత్‌రెడ్డి అన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఎం నాయకుల ధర్నా జరిగిన దృశ్యం

## కేంద్రం ప్రభుత్వం బొగ్గు గనుల వేలంను రద్దు చేయాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 5, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం వెంటనే బొగ్గు గనుల వేలంను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా సిపిఎం నాయకులు ధర్నా నిర్వహించారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద జిల్లా సిపిఎం కార్యదర్శి పి.సత్యం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగ జిల్లా సిపిఎం కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేయాలని, సింగరేణికి బొగ్గు బ్లాకులను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగ పదవవిడతలో 61బొగ్గు బావులను వేలం వేస్తుందన్నారు. అందులో తెలంగాణ రాష్ట్రంలో మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను కూడ వేలం వేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థగ ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీని కూడ ప్రైవేట్ కంపెనీలతో పోటీ పడి వేలం పాటలో పాల్గొనాలని కేంద్రం నిర్ణయించిందని అన్నారు. తెలంగాణకు సింగరేణి తలమానికమన్నారు. దాన్ని మూతపడే వైపున నెట్టె ప్రైవేట్ సంస్థలకు లబ్ది చేకూరేలా పని చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బొగ్గుగనుల వేలం పాటను రద్దు చేయాలని జిల్లా సిపిఎం కార్యదర్శి పి.సత్యం డిమాండ్ చేశారు. ఆ తరువాత జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని జిల్లా సిపిఎం నాయకుల బృందం కలిసి అందజేసింది. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి, ఎ.అశోక్, ఎం.వినోద, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, జి.శ్రీనివాసులు, జె.రాజశేఖర్, ఎం.నరేశ్, ఎం.శంకర్, ఎన్.శ్రీని వాస్, నాయకులు గణేశ్, సఫియా, శారద, చంద్రశేఖర్, కృష్ణనాయక్, లింగ స్వామి, ఉన్నికృష్ణన్, కిష్టప్ప, శ్రీమన్నారాయణ, ఎన్.శ్రీనివాస్‌రావు, నాయ కులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఆరోగ్యసేవలు అందించటానికి డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలి
### మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి తనిఖీలు చేసిన జిల్లా కలెక్టర్ గౌతమ్,పాల్గొన్న డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రఘునాధస్వామి,తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 5, ప్రభాతవార్త** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించటానికి,చికిత్సలు చేయటానికి డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంను, మల్కాజ్‌గిరి ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. కలెక్టర్ గౌతమ్ ఆయా ఆసుపత్రుల్లో పేషంట్ల, ఓపిల, ల్యాబ్‌ల, ఐసియూ యూనిట్స్‌ను, వార్డులను,ఆక్సిజన్ యూనిట్‌ను, ఎక్స్‌రే, ప్రసూతి రూమ్‌లను, ప్రత్యేక నవజాత శిశుకేంద్రంను రికార్డులను పనితీరును పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను డాక్టర్లను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అవసరం ఉన్న చోట వైద్యవైద్య పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీల సంఖ్యను పెంచాలన్నారు. హైరిస్క్ కేసులను గుర్తించి వాటిని గాంధీ, కోఠి హాస్పిటల్స్‌కు రెఫర్ చేయాలన్నారు. డాక్టర్లు, సిబ్బంది విధులు సక్రమంగ నిర్వహించాలని, సమయపాలన పాటించాలని ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ చూడాలని అన్నారు. స్కానింగ్ కోసం స్లాట్‌లు బుక్‌చేసుకునే విధానాన్ని సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. ఫారస్మసీల మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు మలేరియా, డెంగ్యూ వంటి కేసులు ఎన్ని వచ్చినట్లు డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితితులతో ప్రజలు ఇబ్బందులు పడకుండ మలేరియా, డెంగ్యూ బారిన పడకుండ వైద్య సౌకర్యాలు సిద్ధంగ ఉండాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రఘునాధస్వామి, జిల్లా డిసిహెచ్ ఆఫీసర్ డాక్టర్ కోట్యానాయక్, సౌందర్యలత, ఆనంద్, సునీత, సంగీత్, పద్మావతి, సంధ్యారాణి, గీతా,చంద్రకళ, వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ విద్య పథకం పై దరఖాస్తుల స్వీకరణ
### జిల్లా అల్పా సంఖ్యాఖ వర్గాల శాఖ అధికారి హన్మంతరావు

**వికారాబాద్,జులై 05, ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గ సంక్షేమ శాఖ ద్వార విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించ కోరే పేద మైనారిటీ విద్యార్థులకు ముఖ్యమంత్రి విదేశీ విద్య పథకం స్ప్రింగ్ సీజన్ కొరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా అల్పా సంఖ్యాఖ వర్గాల అధికారి కే.హ ఎమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకము ద్వార పేద మైనారిటీ విద్యార్థులకు రూ.20 లక్షలు ఉపకార వేతనం, ఒక వైపు విమాన రావాణా ఖర్చుల క్రింద రూ.60 వేల వరకు మంజూరు చేయబడుతుందని పేర్కొన్నారు. డిగ్రీ (ఇంజనీరింగ్) లో 60% మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేట్ చేయుటకు, పీ.హెచ్.డి చేయాల ఎకునేవారు పీ.జి లో 60% మార్కులు పొందిన వారు అర్హులని తెలిపారు. జనవరి 2024 ఎండి జూలై 2024 మధ్యకాలములో విదేశీ విశ్వ విద్యాలయాలలో ప్రవేశం పొంది ఉన్న మైనారిటీ విద్యార్థులు పథకానికి అర్హులని పేర్కొన్నారు. ధరఖాస్తులు ఆన్లైన్ వెబ్సైట్ ద్వార సమర్పించాలని సూచించారు. ఆన్లైన్ చేయుటకు ఈ నెల 8 వ తేదీ నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకొన్నా హార్డ్ కాపీలు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ కార్యాలయము, కలెక్టర్ కార్యాలయము రూమ్ నెంబరు 17 వికారాబాద్ యందు ఆగష్టు 12 వ తేదీ లోగా సమర్పించాలని తెలిపారు. పథకము యొక్క పూర్తీ వివరాలు, అర్హత ప్రమాణాలు, విద్య అర్హతలు, ధరఖాస్తు చేసుకోవలసిన దేశాల వివరాలు, మ్యాన్డేటోరీ రిక్వైర్మెంట్స్, ఎంపిక విధానం వెబ్ సైట్ లో లభిస్తాయని పేర్కొన్నారు.

## రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బిఆర్‌ఎస్‌తోనే సాధ్యం
### జడ్పిటిసి శ్రీలతసత్యనారాయణ, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



**కొత్తూర్, జూలై 5, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ అన్నారు. కొత్తూర్ మండలంలోని జేపీ దర్గాలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మొండే కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జడ్పీటీసీ పదవి విరమణ మహోత్సవం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.... మహిళ జడ్పీటీసీగా శ్రీలతసత్యనారాయణ రాజకీయంగా ఎంతో ఆహర్నిశలు శ్రమించి, మండల అభివృద్ధి కొరకు తను సుమారు రెండు కోట్ల వరకు నిధులు తెప్పించి, ప్రతి గ్రామ అభివృద్ధికి సహకరించిన, వీర మహిళగా ప్రజలలో వీరాభిమానంగా పొందిందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కొనియాడారు. తను పదవి కాలం చేపట్టిన నుండి చివరి వరకు ఎంతో శ్రమించి చివరి నిమిషం కూడా సమయం వృథా చేయకుండా రూ. 35లక్షల ప్రొసిడింగ్‌ను రిలీజ్ చేయడం ఆమె గొప్పతనమని వారు కొనియాడారు. ఈ ప్రొసిడింగ్‌ను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, పార్టీ సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా గ్రామాల వారిగా గ్రామస్థులకు అందజేశారు. ప్రజల కోసం శ్రమించే ఆమెకు మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే అది కేవలం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత కేవలం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును తిట్టడానికి వారికి సమయం సరిపోతుందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు నీటి మీద మూటలుగానే మిగిలిపోయాయన్నారు. రైతుబంధు పథకాన్ని అమలు చేస్తా మని చెప్పినా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖరీఫ్ సీజన్ వచ్చినప్పటికి ఇప్ప టివరకు రైతుబంధు వేయలేదని ఆవేధన వ్యక్తం చేశారు. రైతురుణమాఫీ చేస్తామని చెప్పిన అది కూడా అమలుకు నోచుకోలేదని తెలిపారు. వచ్చే ఎన్ని కల్లో తిరిగి ముఖ్యమంత్రిగా కేసీఆర్ పదవి పీఠాన్ని అలంకరించడం ఖాయ మన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు వారు ప్రకటించిన పథకాలను అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికలలో అందరం కలిసికట్టుగా కష్టపడి ముం దుకు సాగి విజయాన్ని సాధించుకుందాం అని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీ న్‌రెడ్డి అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ ఎస్ ఎమ్మెల్యే గెలవడం ఖాయమన్నారు. ప్రతిపక్షంలో ఉండి కాంగ్రెస్ పార్టీని నాయకుల పనితీరును ఎండగడదామన్నారు. అనంతరం జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎమ్మెల్సీ నాగ ర్‌కుంట నవీన్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మెన్ ఈట గణేష్, బీఆర్‌ఎస్ సీనియర్ నా యకులు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ య్యయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ డోలి రవి, కౌన్సిలర్లు మాదారం నర్సింలుగౌడ్, సోమ్లానాయక్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీశై లం, గోపాల్‌నాయక్, మధుసూదన్‌రావు, పద్మారావు, గోవింద్ ఆశోక్, అజయ్‌నాయక్, జంగయ్య, కాట్న రాజు, మాదారం కృష్ణగౌడ్, జనార్ధన్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, దామోదర్‌రెడ్డి, దేశాల భీమయ్య, నాగ జంగయ్య, మాణిక్య రెడ్డి, వడ్డే బాలయ్య, గోపాల్‌నాయక్, కాట్న రాజు, బ్యాగరి యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కె.శశాంక

## వనమహోత్సవం లక్ష్య సాధనకు కృషి
### జిల్లా కలెక్టర్ శశాంక

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, జులై 5 ప్రభాతవార్త :** 75వ(వజ్రోత్సవ) వనమహోత్సవం కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక అధికారులకు సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో వనమహోత్సవం కార్యక్రమంపై అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి అన్ని శాఖల అధికారులు, మున్సిపాలిటీ కమీషనర్లు, ఎంపిడివోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వన మహోత్సవాలు 75 సంవత్సరాలు పూరినత చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ వన మహోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ప్రధానంగా ప్రస్తుత 2024 సీజన్‌లో ఆయా శాఖల వారీగా వనమహోత్సవంలో భాగంగా మున్సిపాలిటీలకు, గ్రామీణా ప్రాంతాలకు, వ్యవసాయ రైతులు పొలాల గట్లపైన 82.5లక్షల మొక్కలు నాటాల్సిన లక్ష్యాలను గుర్తుచేస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేలా చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం అయినందున విరివిగా మొక్కలు నాటాలని, దీనిని ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని, నిర్ణీత గడువులోపు లక్ష్యం పూరినత చేయాలని సూచించారు. లక్ష్యాల సాధనకోసం అనువైన స్థలాలను గుర్తిస్తూ, మొక్కలు నాటడంతో పాటు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని, ఏకకాలంలో ఈ పనులు జరగాలని ఆదేశించారు. రోడ్లకు ఇరువైపుల ఖాళీ ప్రదేశాలతో పాటు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు, కాలువ కట్టలపైనా పెద్ద ఎత్తున మొక్కలు నాటి, వాటి సంరక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో,పట్టణాల్లో ఇంటిఇంటికి పండ్లమొక్కలను అందచేయాలని సూచించారు. రానున్న మూడు వారాల్లోపు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వందశాతం మొక్కలు నాటించాలని గడువు విధించారు. రోజువారీగా నివేధికలు సమర్పించడంతో పాటు, వివరాలను వెంటవెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పచ్చదనం,పర్యావరణ పరిరక్షణతో మూడిపడిన వనమహోత్సవం కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ ప్రాధ్యానతనిస్తూ లక్ష్యాలను సాధనకై పకడ్బందీ ప్రణాళికలు రూపొందించుకుని తదనుగుణంగా అంకితభావంతో కృషి చేయాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయాలి ఆదేశించారు. మొక్కలు నాటే కార్యక్రమాలను రూపొందించిన సమయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని,గ్రామీణ ప్రాంతాలలో మండల ప్రత్యేక అధికారులను భాగస్వాములు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఎఫ్‌వో సుధాకర్‌రెడ్డి, పిడి పిడి డిఆర్డిఎ శ్రీలత, జడ్పిసిఈవో కృష్ణరెడ్డి,జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వికారాబాద్ అనంతగిరిపల్లి బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అస్వస్థత

**వికారాబాద్ రూరల్, జులై 5 ప్రభాతవార్త :** వికారాబాద్ అనంతగిరిపల్లి బాలుర వసతి గృహంలో గత రెండు రోజులుగా సుమారు 40 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై వాంతులు విరోచనాలతో బాధపడుతూ వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు విద్యార్థి సంఘాల నాయకులు వసతి గృహం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన కారణాలపై ఆరా తీశారు. అపరిశ్రుభత కారణంగానే విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని రెండు రోజులుగా అనారోగ్యంతో విద్యార్థులు బాధపడుతున్న తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వని హాస్టల్ సిబ్బంది వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు హాస్టల్‌ను తనిఖీ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు